




దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని   తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ   సంపుటి :05   సంచిక :107   ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్   మంగళవారం 11-08-2026   పేజీలు : 4   వెల : రూ. 3/-


## బండి సంజయ్ బతుకంతా మత రాజకీయమే..



హైదరాబాద్,మతాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయం చేయడమే బీజేపీ నేతల నైజమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ బతుకంతా మతం పేరు చెప్పుకుని బతకడమేనని ధ్వజమెత్తారు. బోనాల పండగను బండి సంజయ్ రాజకీయం చేయడం దారుణమని అన్నారు. హైందవ ధర్మ పరిరక్షణే మా లక్ష్యం: రాష్ట్రవ్యాప్తంగా బోనాల పండుగ అత్యంత వైభవంగా జరిగిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రభుత్వ లాంఛనాలతో బోనం, పట్టువస్త్రాలు సమర్పించిన అంశాన్ని గుర్తుచేశారు. ప్రతి గుడికి నిధులు కూడా కేటాయించామని అన్నారు. అయినప్పటికీ బండి సంజయ్ బోనాల పండగను సైతం రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో రాష్ట్రంలోని ప్రాచీన దేవాలయాలను అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. హైందవ ధర్మ పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు.

ఆలయాల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయింపు:

బీజేపీ నేతలు హిందూ మతం పేరుతో రాజకీయాలు చేయడం తప్పా ఆలయాల అభివృద్ధి కోసం చేసిందేమి లేదని ఆది శ్రీనివాస్ అన్నారు. అదే రేవంత్ సర్కార్ మాత్రం అనేక ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించిందని తెపిపారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాలయ పునర్నిర్మాణం కోసం రూ. 250 కోట్లు, బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ. 225 కోట్లు, కాళేశ్వరం దేవాలయ పునర్నిర్మాణం కోసం రూ. 250 కోట్లు కేటాయింపు జరిగిందని అన్నారు. అలాగే భద్రాచలం పునర్నిర్మాణం కోసం రూ. 351 కోట్లు కేటాయించిన అంశాన్ని గుర్తి చేశారు. అంతేకాకుండా గోదావరి పుష్కరాల కోసం రూ. 1,000 కోట్లు కేటాయించగా ఇప్పటికే రూ. 300 కోట్లు విడుదల చేసి గోదావరి వెంబడి ఉన్న 96 పుణ్యక్షేత్రాలను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.

బండి సంజయ్‌కి ఆది సవాల్:

“బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఈ స్థాయిలో హిందూ దేవాలయాలు అభివృద్ధి జరిగాయా? గుళ్లకు ఇంత పెద్ద ఎత్తున నిధులు కేటాయించారా?” అని బండి సంజయ్‌ను ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ లౌకిక పార్టీ అని, అన్ని మతాలను గౌరవిస్తామని చెప్పారు. ఓట్ల కోసం మతాల మధ్య చిచ్చు పెట్టే సంస్కృతి కాంగ్రెస్‌ది కాదని స్పష్టం చేసిన ఆయన.. చేతనైతే కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తెచ్చి మాట్లాడాలని సవాల్ విసిరారు.

## సీఎం రేవంత్ తమ్ముని కంపెనీకి ఫోర్త్ సిటీలో 5 ఎకరాలు



హైదరాబాద్,మూడేళ్ల పాలనలో సీఎం రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదు.. కుంభకోణాలు తప్ప.. ఫోర్త్ సిటీ పేరుతో విచ్చల విడిగా సీఎం రేవంత్ పెద్ద భూ కుంభకోణానికి పాల్పడ్డారని కార్పొరేషన్ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో మన్నెక్రిశాంక్ మాట్లాడుతూ..నల్ల ధనాన్ని విదేశాలకు పంపి దాన్ని తెల్లగా మార్చుకోవాలని కుట్ర చేస్తున్నారని అన్నారు.ట్రెజరాక్ట్ అడ్వాన్స్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరుతో అనుముల కొండల్ రెడ్డి షెల్ కంపెనీ ఏర్పాటు చేశారని.. కేవలం లక్ష రూపాయలతో ఒక చిన్న ఇంట్లో ఈ కంపెనీ పెట్టారన్నారు. ఈ కంపెనీ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ సిస్టమ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ చేస్తుంది. ఏరో స్పేస్ డిఫెన్స్ సిస్టమ్ ప్రొడక్షన్ చేయాలంటే లైసెన్స్ ఉండాలి... కానీ ఈ కంపెనీకి లైసెన్స్ లేదు . ఈ కంపెనీ ఏమీ మ్యానుఫ్యాక్చరింగ్ చేయకపోయినా రూ. కోటి ఫారిన్ ఎక్స్చేంజ్ ఎర్నింగ్స్ వచ్చాయి.ఇంకో దారుణం ఏంటి అంటే కంపెనీలో అసలు ఒక్క ఉద్యోగి కూడా లేకుండా పటాన్‌చెరువులోని శ్రీకృష్ణ నగర్‌లో ఒక ఇంట్లో నడిపిస్తున్నారన్నారు.ఈ కంపెనీ షేర్ల విలువ కూడా కేవలం రూ. లక్ష మాత్రమేనన్నారు.సీఎం రేవంత్ రెడ్డి సొంత తమ్ముని కంపెనీకి ఫోర్త్ సిటీలో 5 ఎకరాలు కేటాయించారు. వందల కోట్ల విలువైన భూమిని తక్కువకు రేవంత్ ప్రభుత్వం కట్టబెట్టిందని కార్పొరేషన్ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్ వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి తమ కుటుంబ సభ్యులకు ఫోర్త్ సిటీ భూములు కట్టబెడుతున్నారు.

## ఈ నెల 15న సంగారెడ్డిలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

హైదరాబాద్,ఈ నెల 15న సీఎం రేవంత్ రెడ్డి సంగారెడ్డిలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు.అనంతరం సభనుద్దేశించి ప్రసంగిస్తారు. సీఎం పర్యటన నేపథ్యంలో సంగారెడ్డిలోని తారా డిగ్రీ కాలేజీలో హెలిప్యాడ్, అంబేద్కర్ స్టేడియంలో సభా స్థలిని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ పరిశీలించారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. పదేళ్ల దీ=ూ పాలనలో అరకొరగా రేషన్ కార్డులు ఇచ్చారని అన్నారు. కోటి 5 లక్షల మందికి కాంగ్రెస్ ప్రభుత్వంలో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని.. కాంగ్రెస్ పార్టీ కమిట్ మెంట్ తో పని చేస్తుందన్నారు. మంత్రి ఉత్తమ్, సీఎం రేవంత్ తీసుకున్న నిర్ణయం హర్షించదగిన విషయమన్నారు. ఇది ప్రభుత్వ కార్యక్రమం అయినా కాంగ్రెస్ పార్టీ తరపున సీఎం



రేవంత్‌కు ఘనంగా స్వాగతం పలుకుతామన్నారు. సభను 50 వేల మందితో నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

## హైడ్రాకు మద్దతుగా నగరవాసుల ర్యాలీలు

హైదరాబాద్,చెరువులు, పార్కులు, నాలాలు, వరద కాలువలను పరిరక్షించేందుకు చర్యలు చేపడుతున్న హైదరాబాద్ విపత్తు నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ సంస్థ (హైడ్రా)కు మద్దతుగా నగరంలో ర్యాలీలు కొనసాగుతున్నాయి. పలు కాలనీల సంక్షేమ సంఘాలు, గేటెడ్ కమ్యూనిటీల నివాసితులు, అపార్ట్‌మెంట్ వాసులు హైడ్రాకు సంఘీభావం ప్రకటిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చెరువులు, పార్కులు ఆక్రమణలకు గురికాకుండా కాపాడాల్సిన అవసరం ఉందని, హైడ్రా వంటి వ్యవస్థ కొనసాగాలని వారు కోరుతున్నారు.ఐటీ కారిడార్‌కు సమీపంలోని గండిపేట మండలం పుప్పాలగూడ–నార్సింగి సరిహద్దులో ఉన్న 52.20 ఎకరాల చెరువు పరిరక్షణకు హైడ్రా చర్యలు తీసుకోవడాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు స్వాగతించారు. చెరువు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకున్నందుకు స్థానికులు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్ వాసులు ర్యాలీలు నిర్వహించి తమ మద్దతు తెలిపారు.

ముష్కిన్ చెరువుకు రక్షణ

ముష్కిన్ చెరువు పరిధిలో సుమారు 35 ఎకరాల మేర ఆక్రమణలకు ప్రయత్నాలు జరిగాయని పేర్కొంటూ.. వాటిని తొలగించి చెరువును పరిరక్షించేందుకు హైడ్రా చర్యలు తీసుకుందని స్థానికులు తెలిపారు. చెరువుల పరిరక్షణతోనే భవిష్యత్‌లో వరద ముప్పును తగ్గించగలమని వారు అభిప్రాయపడ్డారు.

వరద కాలువ, పార్కు పరిరక్షణకు ర్యాలీ

గచ్చిబౌలిలోని జనార్దన్‌హిల్స్ కాలనీలో ఆక్రమణలకు గురైన వరద కాలువను పరిరక్షించడంతో పాటు దానికి ఆనుకుని ఉన్న పార్కును కాపాడినందుకు



హైడ్రాకు మద్దతుగా ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. సీనియర్ సిటిజన్లు, మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హైడ్రాను ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి వారు సంఘీభావం ప్రకటించారు.

‘హైడ్రా ఉండాల్సిందే’

నగర భవిష్యత్ సురక్షితంగా ఉండాలంటే చెరువులు, పార్కులు, నాలాలు, వరద కాలువలను పరిరక్షించాల్సిందేనని ర్యాలీలో పాల్గొన్న పలువురు పేర్కొన్నారు. వరదలు లేని నగరం కావాలంటే సహజ నీటి వనరులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చెరువుల ఆక్రమణలను అడ్డుకునే చర్యలకు తాము మద్దతుగా నిలుస్తామని స్పష్టం చేశారు. హైడ్రా చర్యలపై నగరంలో అనుకూల, ప్రతికూల అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో స్థానికుల మద్దతు కార్యక్రమాలు కొనసాగుతుండటం చర్చనీయాంశంగా మారింది.

## ఇరిగేషన్‌లో ప్రమోషన్లకు ‘జీవో-32’ బ్రేక్..ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి



హైదరాబాద్: ఇరిగేషన్ శాఖలో ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియ మరోసారి వివాదాస్పదంగా మారింది. ఏళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న వందలాది మంది ఉద్యోగులకు జీవో–32 అడ్డంకిగా మారిందని ఉద్యోగ సంఘాలు, ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హత, సీనియారిటీ ఉన్నప్పటికీ పదోన్నతులు నిలిచిపోవడంతో ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. గతంలో ముఖ్యమంత్రి జీవో–32ను తొలగిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు ఆ దిశగా స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. నిబంధనల ప్రకారం వెంటనే డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీలు (డీపీసీలు) నిర్వహించి అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇరిగేషన్ శాఖలో పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైన ప్రతిసారీ జీవో–32 అంశం తెరపైకి వస్తోందని ఉద్యోగులు చెబుతున్నారు. ప్రమోషన్ జాబితాలు సిద్ధమైన తర్వాత అభ్యంతరాలు, వివరణలు, నిబంధనలపై వివాదాలు తలెత్తడంతో మొత్తం ప్రక్రియ మళ్లీ మొదటికి వస్తోందని పేర్కొంటున్నారు. ఫలితంగా ఏళ్లుగా ఒకే హోదాలో పనిచేస్తున్న ఉద్యోగులు తదుపరి స్థాయికి వెళ్లలేక నిరాశకు గురవుతున్నారు. తమకంటే జూనియర్లు ఇతర మార్గాల్లో అవకాశాలు పొందుతుండగా.. తాము మాత్రం పదోన్నతి కోసం ఎదురుచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీతం నుంచి పెన్షన్ వరకు ప్రభావం..

పదోన్నతి అనేది కేవలం హోదా పెరగడం మాత్రమే కాదని ఉద్యోగులు చెబుతున్నారు. వేతనాల పెంపుతో పాటు పెన్షన్, ఇతర సేవా ప్రయోజనాలు, పరిపాలనా బాధ్యతలు, భవిష్యత్ కెరీర్ అభివృద్ధిపై కూడా పదోన్నతులు ప్రభావం చూపుతాయని పేర్కొంటున్నారు. ప్రమోషన్లు ఆలస్యం కావడంతో వేతనాలు, పదవీ విరమణ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని అంటున్నారు. సర్వీస్ కాలం పూర్తయినా పదోన్నతి పొందకుండానే పదవీ విరమణ చేయాల్సిన పరిస్థితి కొందరికి ఎదురవుతోందని ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి.

సీఎం హామీ ఏమైంది?..

జీవో–32పై గతంలో ఉద్యోగ సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేసిన సమయంలో ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఉద్యోగులు గుర్తుచేస్తున్నారు. అయితే హామీ ఇచ్చి చాలా కాలం గడిచినా జీవోపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడంతో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొంటున్నారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్నప్పటికీ.. పదోన్నతుల విషయంలో మాత్రం ఎందుకు జాప్యం జరుగుతోందని ప్రశ్నిస్తున్నారు. శాఖలో ఖాళీలు ఉన్న పోస్టులకు అర్హత, సీనియారిటీ, రిజర్వేషన్ నిబంధనలను పాటిస్తూ వెంటనే పదోన్నతులు కల్పించాలని ఉద్యోగులు కోరుతున్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని విడిగా పరిశీలించి

## పేదల సంక్షేమం, భూ హక్కుల పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం

ఎల్కతుర్తి,పేదల సంక్షేమం, రైతుల భూ హక్కుల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు.హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి రూ.3.25 కోట్ల అంచనా వ్యయంతో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మించనున్న తహసీల్దార్ కార్యాలయ భవనానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జిల్లాలు, డివిజన్లు, మండలాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటికి అవసరమైన కార్యాలయ భవనాలు, మౌలిక సదుపాయాలు కల్పించలేదని విమర్శించారు. దీంతో అనేక ప్రాంతాల్లో మండలాలు ఉన్నా కార్యాలయ భవనాలు లేక ప్రజలు, అధికారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు.ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల నిర్మాణానికి సుమారు రూ.600 కోట్లు కేటాయించిందని తెలిపారు. ఇందులో భాగంగా సుమారు 180 తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చి రైతులు, భూ యజమానులకు భూములపై సంపూర్ణ హక్కులు, భద్రత కల్పించే దిశగా చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. భూ రికార్డుల ప్రక్షాళనతో పాటు పారదర్శక విధానంలో భూభారతి ద్వారా రైతులకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. భూ పరిపాలనలో మరిన్ని సంస్కరణలు చేపట్టనున్నట్లు తెలిపారు.రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో తొలి విడతగా 70 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. రాబోయే ఏడాదిన్నర నుంచి రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి రెవెన్యూ గ్రామంలోని ప్రతి అంగుళం భూమిని సర్వే చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.ప్రతి భూ పార్సిల్‌కు ప్రత్యేక గుర్తింపు కల్పించడంతో పాటు భౌగోళిక కోఆర్డినేట్స్‌తో కూడిన మ్యాప్‌ను రూపొందించి అందించే విధంగా ఆధునిక



సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజల సహకారంతో భూ సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేసి భవిష్యత్తులో భూములకు సంబంధించి వివాదాలు, సమస్యలు తలెత్తకుండా శాశ్వత భూ భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

ఎల్కతుర్తి సమగ్ర అభివృద్ధికి కృషి

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఎల్కతుర్తి మండల ప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్న తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు సమకూర్చి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు.ఎల్కతుర్తి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మండలానికి అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.నిర్మాణంలో ఉన్న సమగ్ర ఆర్టీఓ కార్యాలయ భవన పనులను పూర్తిచేసేందుకు అవసరమైన అదనపు నిధులను కేటాయించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. ఎల్కతుర్తి ప్రాంత అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుని మండలాన్ని మరింత ప్రగతిపథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తికి స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో కార్యాలయానికి అవసరమైన అదనపు నిధులను ఈ వారంలోనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, అదనపు కలెక్టర్ రవి, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సామ్య నాయక్, సర్పంచ్ మునిగడప లావణ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను భావితరాలకు అందించాలి

హైదరాబాద్,సామాజిక సమానత్వం కోసం పోరాడిన గొప్ప వీరుడు, ధైర్యసాహసాలకు ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళులర్పించారు. సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ ధర్మ పరిపాలన సంస్థ, జై గౌడ్ ఉద్యమం జాతీయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. సర్వాయి పాపన్న గౌడ్ కేవలం యోధుడు మాత్రమే కాదని, అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాన్య ప్రజల గౌరవం కోసం పోరాడిన ప్రజా నాయకుడని పేర్కొన్నారు. తన కాలంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక అసమానతలను ఎదుర్కొంటూ ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారని అన్నారు.ప్రజల కోసం పోరాడాలి, అన్యాయాన్ని ఎదిరించాలి, సమాజంలో సమానత్వాన్ని నెలకొల్పాలి అనే స్ఫూర్తిని సర్వాయి పాపన్న గౌడ్ తన జీవితంతో చాటిచెప్పారని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు.




## సంపాదకీయం

మంగళవారం 11-08-2026

# విద్యావిధానంలో మార్పులు అనివార్యమా...

కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాను కేవలం ఒక వ్యక్తి రాజకీయ పరాజయంగా మాత్రమే చూడకూడదు. అది భారత విద్యా వ్యవస్థలో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోతున్న లోతైన సంస్థాగత సంక్షోభానికి ప్రతీకగా భావించాలి. ఈ రాజీనామా ప్రజా ఒత్తిడితో జరిగిందా, రాజకీయ వ్యూహంలో భాగమా అన్నది పక్కన పెడితే, విద్యార్థులు లేవనెత్తిన ప్రధాన ప్రశ్నలకు ఇంకా సమాధానాలు లభించలేదు. భారతదేశం తన పరీక్షా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని తిరిగి నెలకొల్పగలదా? బాధ్యత అనేది కేవలం రాజకీయ త్యాగాలకు మాత్రమే పరిమితమవుతుందా? మౌనంగా ఉండేందుకు నిరాకరిస్తున్న యువత ఆకాంక్షలకు పాలన అనుగుణంగా మారగలదా? విద్యార్థుల ఉద్యమం ఒక చారిత్రక విజయాన్ని సాధించింది. మంత్రి రాజీనామా ప్రజాస్వామ్య పోరాటానికి నైతిక విజయమే అయినప్పటికీ, ఒక వ్యక్తిని మార్చడం ద్వారా వ్యవస్థాగత లోపాలు తొలగిపోతాయని భావించడం సరళీకరణ అవుతుంది. ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల్లో అక్రమాలు, పరిపాలనా పారదర్శకత లోపం, విద్యాసంస్థలపై తగ్గుతున్న విశ్వాసం వంటి సమస్యలు దశాబ్దాలుగా పేరుకుపోయిన నిర్మాణాత్మక వైఫల్యాలు. ఒక రాజీనామాతో అవి అంతరించిపోవు. ఈ ఉద్యమంలో అత్యంత విశేషమైన అంశం జనరేషన్-జెడ్ ఒక స్వతంత్ర రాజకీయ శక్తిగా అవతరించడం. గతంలో విద్యార్థి ఉద్యమాలు రాజకీయ పార్టీల ఆధిపత్యంలో నడిచినప్పటికీ, ఈ ఉద్యమం డిజిటల్ సమీకరణ, వికేంద్రీకృత నాయకత్వం, సమస్యల ఆధారిత రాజకీయాల చుట్టూ రూపుదిద్దుకుంది. నేటి యువతకు సిద్ధాంత నినాదాల కంటే విద్యా న్యాయం, ఉపాధి అవకాశాలు, పారదర్శక పరిపాలన వంటి అంశాలే ముఖ్యంగా మారాయి. ఇది భారత ప్రజాస్వామ్యంలో భాగస్వామ్య స్వరూపం మారుతున్నదనడానికి నిదర్శనం. ఈ నిరసనలు పరీక్షా సంస్కరణలకే పరిమితం కాకుండా, యువతలో పెరుగుతున్న అసంతృప్తికి ప్రతీకగా మారాయి. నిరుద్యోగం, ఉద్యోగ అవకాశాలపై అనిశ్చితి, వరుసగా జరుగుతున్న పరీక్షా అవకతవకలు, ప్రభుత్వ సంస్థలపై తగ్గుతున్న నమ్మకం –ఇవన్నీ కలిసి యువతలో తీవ్ర నిరాశను కలిగించాయి. అందువల్ల ఈ ఉద్యమం ఒక పరీక్ష గురించి మాత్రమే కాకుండా, ఒక తరం భవిష్యత్తు గురించి సాగిన పోరాటంగా మారింది ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ప్రజాభిప్రాయానికి స్పందించాల్సిన బాధ్యత కలిగి ఉంటాయి. బాధ్యత అనేది రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యానికి మూలస్తంభం. అయితే అది కేవలం మంత్రి రాజీనామాతో ముగియకూడదు. పరీక్షల నిర్వహణ సంస్థలు, నియామక సంస్థలు, పోలీసు దర్యాప్తు యంత్రాంగం, సైబర్ భద్రతా వ్యవస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, పోటీ పరీక్షల నిర్వహణలో భాగస్వాములైన అన్ని పరిపాలనా సంస్థలకు కూడా సమానంగా వర్తించాలి. సంస్థాగత బాధ్యత లేకుండా రాజకీయ బాధ్యత ప్రతీకాత్మకంగానే మిగిలిపోతుంది. విద్యార్థులపై జరిగిన పోలీసు చర్య ప్రజాస్వామ్య పాలనలో మరో కీలక కోణాన్ని గుర్తుచేస్తుంది. శాంతియుత నిరసన వ్యక్తం చేయడం ప్రతి పౌరుని రాజ్యాంగబద్ధ హక్కు. అదే సమయంలో చట్టం, శాంతి భద్రతలను కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. ఈ రెండింటి మధ్య సమతుల్యతను పాటిస్తూ, పోలీసు చర్యలు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, పౌరహక్కులను గౌరవించే విధంగా ఉండాలి. ప్రజాస్వామ్యం విభేదాలను అణచివేయడం వల్ల కాదు; ప్రజల ఆందోళనలను నిర్మాణాత్మకంగా వినడం వల్ల బలపడుతుంది. సమకాలీన రాజకీయ చర్చలను ప్రభావితం చేయడంలో సామాజిక మాధ్యమాల పాత్ర కూడా ఎంతో పెరిగింది. మీమ్స్, వ్యంగ్య చిత్రాలు, డిజిటల్ ప్రచారాలు ప్రజల దృష్టిని ఆకర్షించే శక్తివంతమైన సాధనాలుగా మారాయి. అయితే అవి సంక్లిష్టమైన విధాన చర్చలను అతిగా సరళీకరించే ప్రమాదం కూడా ఉంది. ప్రజాభిప్రాయం వైరల్ కథనాల కంటే ఆధారాలతో కూడిన సమాచారంపై ఆధారపడాలి. అదే విధంగా, ఇ-20 ఇథనాల్ మిశ్రమ ఇంధనం చుట్టూ జరిగిన చర్చలు ప్రజల విశ్వాసం పారదర్శకమైన శాస్త్రీయ సమాచారంపై ఆధారపడుతుందని స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ, ఇంధన భద్రత, సాంకేతిక మార్పులకు సంబంధించిన ప్రభుత్వ విధానాలు నిరంతర ప్రజా చర్చకు లోనవ్వాలి. ప్రజలకు ప్రయోజనాలు, ఖర్చులు, దీర్ఘకాలిక ప్రభావాలపై స్పష్టమైన ఆధారాలతో కూడిన సమాచారం అందించాలి. ఈ రాజీనామా భారత రాజకీయాల్లో ఒక మలుపుగా నిలుస్తుందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ప్రజల నిరంతర ఒత్తిడి ప్రభుత్వాలను తమ నిర్ణయాలను పునఃపరిశీలించడానికి దారితీయగలదనే విషయాన్ని ఇది సూచిస్తుందని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే దీనిపై తుది తీర్పు భవిష్యత్ రాజకీయ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది. ప్రజాస్వామ్య చరిత్రలో ఇటువంటి సంఘటనలు కాలక్రమేణా పౌరులు–ప్రభుత్వాల సంబంధాన్ని పునర్నిర్వచిస్తాయి. అత్యంత ముఖ్యంగా, భారత విద్యా సంక్షోభం ప్రశ్నాపత్రాల లీకులతో మాత్రమే పరిమితం కాదు. పరీక్షల వాయిదాలు, నియామకాల ఆలస్యం, విద్యాసంస్థల్లో ఖాళీలు, ఉన్నత విద్యలో తగిన పెట్టుబడుల కొరత, విద్యా రంగం వాణిజ్యీకరణ–ఇవన్నీ కలిసి విద్యార్థుల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. విద్యా పరిపాలనలో సమగ్ర సంస్కరణలు లేకుండా పరీక్షా సంస్కరణలు మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించలేవు. భారతదేశానికి అత్యవసరంగా సమగ్ర పరీక్షా సమగ్రత వ్యవస్థ అవసరం. సురక్షితమైన డిజిటల్ మౌలిక వసతులు, స్వతంత్ర పరీక్షా నియంత్రణ సంస్థలు, బలమైన సైబర్ భద్రతా వ్యవస్థలు, నియామక ప్రక్రియల పారదర్శక ఆడిట్లు, పరీక్షా మోసాలపై వేగవంతమైన న్యాయ చర్యలు, సమాచార బహిర్గతం చేసే వ్యక్తులకు రక్షణ, పోటీ పరీక్షలకు దేశవ్యాప్తంగా ఏకరీతి ప్రమాణాలు ఏర్పాటు చేయాలి. అలాగే తీవ్రమైన విద్యా ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యార్థులకు మానసిక సలహా, సహాయక వ్యవస్థలను బలోపేతం చేయాలి. చివరికి, ఏ విద్యార్థి ఉద్యమానికైనా నిజమైన విజయాన్ని కేవలం ఒక మంత్రి రాజీనామాతో కొలవలేం. అది శాశ్వతమైన సంస్థాగత సంస్కరణలకు దారితీస్తే చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది. నిర్మాణాత్మక సంస్కరణలే శాశ్వత మార్పును తీసుకువస్తాయి. ఈ పరిణామాలు విధాన నిర్ణేతలకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నాయి. విద్య అనేది కేవలం పరిపాలనా రంగం కాదు; అది కోట్లాది భారత యువత కలలు, ఆశయాలు, భవిష్యత్తుకు ప్రతీక. పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతను పునరుద్ధరించడం, పాలనలో పారదర్శకత పెంపొందించడంలో, విద్యార్థుల రాజ్యాంగబద్ధ హక్కులు రక్షించడం, ప్రజల విశ్వాసాన్ని తిరిగి నెలకొల్పడం జాతీయ ప్రాధాన్య అంశాలు మారాలి. అప్పుడే భారతదేశం ప్రజల ఆగ్రహాన్ని అర్థవంతమైన విద్యా సంస్కరణలు, పజాస్వామ్య పునరుజ్జీవనంగా మార్చగలదు.

# తల్లిపాలు... శిశువు తొలి హక్కు - ఆరోగ్యకర తెలంగాణకు బలమైన పునాది...

## ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘన ముగింపు... ఏడాది పొడవునా అవగాహన కొనసాగించాలని ప్రజల ఆకాంక్ష

పుట్టిన శిశువుకు తల్లిపాలు ప్రకృతి ప్రసాదించిన తొలి అమృతం. శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన పోషకాలు, వ్యాధి నిరోధక శక్తిని అందించే అత్యుత్తమ ఆహారం తల్లిపాలే. ప్రతి ఏడాది ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహించే ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. గత ఏడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్రచార కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, ఆరోగ్య శిబిరాలు ప్రజల్లో తల్లిపాల ప్రాముఖ్యతపై విశేష చైతన్యాన్ని కల్పించింది.

ప్రభుత్వ ప్రచారంతో పెరిగిన అవగాహన...

తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య శాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించింది. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక కౌన్సెలింగ్ అందించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు, పోస్టర్ ప్రదర్శనలు, ప్రమాణ స్వీకార కార్యక్రమాలు, ఇంటింటికీ ప్రచారం ద్వారా తల్లిపాలే శిశువుకు అమృతంతో సమానమని ప్రజలకు వివరించారు. ప్రధానంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్లలో జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో తల్లిపాల ఆవశ్యకతపై సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచనలు చేయడం జరిగింది.

శిశువుకు తొలి గంటలోనే తల్లిపాలు...

వైద్య నిపుణుల సూచనల ప్రకారం శిశువు జన్మించిన తొలి గంటలోనే తల్లిపాలు పట్టించడం అత్యంత అవసరం. తొలి పాలు (కొలస్ట్రం)లో ఉండే యాంటీబాడీలు శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని అందిస్తాయి. మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలే ఇవ్వాలని, అనంతరం అనుబంధ ఆహారంతో పాటు రెండు సంవత్సరాల వరకు తల్లిపాలను కొనసాగించాలని వైద్యులు సూచిస్తున్నారు.

తల్లిపాల ప్రయోజనాలు ఎన్నో...

తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారం అందించడమే కాకుండా విరేచనాలు, న్యుమోనియా, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు వంటి వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి. మెదడు అభివృద్ధి, జ్ఞాపకశక్తి పెరుగుదలకు తోడ్పడతాయి. తల్లులకు కూడా ప్రసవానంతరం త్వరగా కోలుకోవడం, రొమ్ము మరియు అండాశయ క్యాన్సర్ ప్రమాదం తగ్గడం వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

వైద్యుల సలహాలు...

తల్లిపాలు శిశువుకు అత్యంత సురక్షితమైన, పరిశుభ్రమైన, సంపూర్ణ ఆహారమని వైద్యులు పేర్కొంటున్నారు. తల్లులు సమతుల్య ఆహారం తీసుకోవడం, తగినంత విశ్రాంతి తీసుకోవడం, ఒత్తిడికి దూరంగా ఉండడం ద్వారా తల్లిపాల ఉత్పత్తి మెరుగుపడుతుందని సూచిస్తున్నారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలని సలహా ఇస్తున్నారు.

అవగాహన ఏడాది పొడవునా కొనసాగాలి...

ఈ ఏడాది వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ప్రచార కార్యక్రమాలు ప్రజల్లో మంచి స్పందన పొందాయి. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమనే సందేశం విస్తృతంగా చేరింది. అయితే ఈ అవగాహన కార్యక్రమాలు కేవలం వారోత్సవాలకే పరిమితం కాకుండా ఏడాది పొడవునా నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని ప్రజలు, వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రతి గ్రామంలో, ప్రతి పట్టణంలో గర్భిణులు, బాలింతలకు తరచూ అవగాహన సదస్సులు, ఆరోగ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తే మరింత మంచి ఫలితాలు సాధించవచ్చని సూచిస్తున్నారు.

ఆరోగ్యవంతమైన తెలంగాణకు తల్లిపాలే పునాది...

ఆరోగ్యవంతమైన భావితరాలను తీర్చిదిద్దడంలో తల్లిపాల పాత్ర అమోఘం. ప్రభుత్వ చర్యలు, వైద్యుల మార్గదర్శకత్వం, కుటుంబ సభ్యుల సహకారం, సమాజ భాగస్వామ్యం కలిసివస్తే ప్రతి శిశువుకు తల్లిపాల హక్కు సాకారం అవుతుంది. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ముగిసినా, "తల్లిపాలపై అవగాహన ప్రతి రోజూ కొనసాగాలి" అనే సందేశమే ఈ ఏడాది కార్యక్రమాల ప్రధాన ఫలితంగా నిలిచింది. తల్లిపాలు కేవలం శిశువు ఆహారం మాత్రమే కాదు... ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి ప్రకృతి ప్రసాదించిన అమూల్య వరం.

సీనియర్ పాత్రికేయురాలు
సయ్యదా ఆలియా ఇస్మత్
సెల్: 8639754985

# ప్లాస్టిక్ కరెన్సీ ప్రయోజనకరమే!




న్యూఢిల్లీ,భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) 2027 –28 ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుండి పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. క్షేత్రస్థాయి పరీక్షలలో మొదటగా రూ. 10, రూ. 20 నోట్లను పరీక్షిస్తారు. వాటి మన్నిక, వాతావరణ అనుకూలతను తనిఖీ చేయడానికి, ప్రతి డినామినేషన్‌కు చెందిన సుమారు ఒక బిలియన్ నోట్లను జారీ చేస్తారు. ప్రస్తుతం ఉన్న కాగితపు నోట్లకు అదనంగా పాలిమర్ నోట్లు కూడా చెలామణిలో ఉంటాయి. ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ధ్రువీకరించినట్లుగా, 2028 ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో వీటిని ప్రవేశపెట్టనున్నారు. అధిక చలామణి, తక్కువ కాలపరిమితి కారణంగా మొదట్లో క్షేత్రస్థాయి పరీక్ష కోసం ప్రతి డినామినేషన్‌లో ఒక బిలియన్ (100 కోట్ల) పది, ఇరవై రూపాయల నోట్లు ప్రవేశపెట్టనున్నారు. అయితే, ప్రస్తుత కాగితపు నోట్లను మార్చడానికి లేదా ఉపసంహరించుకోవడానికి ఆర్‌బిఐ వద్ద ప్రస్తుతం ఎలాంటి ప్రణాళికలు లేవు. పాలిమర్ నోట్లు సాంప్రదాయ కాటన్ ఆధారిత కాగితపు నోట్ల కంటే గణనీయంగా ఎక్కువ కాలం మన్నుతాయి. అంతేకాదు, ఇవి మురికి, తేమ, చిరిగిపోవడాన్ని చాలా సమర్థవంతంగా నిరోధిస్తాయి. పారదర్శక భద్రతాపరమైన చిహ్నాలు, సంక్లిష్ట హోలోగ్రామ్‌ల వంటి నకలు చేయడానికి వీలు లేని కష్టమైన ప్రమాణాలతో వీటిని రూపొందిస్తారు.ప్రపంచవ్యాప్తంగా సుమారు 60 దేశాలు ప్లాస్టిక్ (పాలీమర్) కరెన్సీ నోట్లను పూర్తిగా లేదా పాక్షికంగా ఉపయోగిస్తున్నాయి. వీటిలో ఆస్ట్రేలియా, కెనడా, యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె), న్యూజిలాండ్, సింగపూర్, మలేషియా, వియత్నాం, రొమేనియా వంటి ప్రముఖ దేశాలు తమ ఆర్థిక వ్యవస్థల్లో ప్లాస్టిక్ నోట్లను విజయవంతంగా చలామణి చేస్తున్నాయి. వీటిలో కొన్ని దేశాలు ప్రత్యేక సందర్భాలను పురస్కరించుకుని నిర్దిష్ట విలువ గల స్మారక కరెన్సీ నోట్లను జారీ చేశాయి. అయితే, ప్రపంచంలోనే మొట్టమొదటిసారి సాధారణ చలామణి కోసం, ఆస్ట్రేలియా పాలిమర్ కరెన్సీ నోట్లను జారీ చేసింది. దేశ ద్వి శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఆస్ట్రేలియా, ఒక స్మారక ప్లాస్టిక్ 10 డాలర్ల నోటును జనవరి 27, 1988న విడుదల చేసింది. 1996 నాటికి ఆ దేశం పూర్తిగా ప్లాస్టిక్ నోట్లకు మారిపోయింది. కెనడా తన దేశంలోని అన్ని ప్రధాన కరెన్సీ నోట్లను పాలిమర్ పదార్థంతో ముద్రించి చలామణి చేస్తోంది. యునైటెడ్ కింగ్‌డమ్ పాత పేపర్ నోట్లను రద్దు చేసి వాటి స్థానంలో పౌండ్ నోట్లను పూర్తిగా ప్లాస్టిక్ రూపంలోకి మార్చివేసింది. న్యూజిలాండ్, సింగపూర్, మలేషియా, మెక్సికో, సౌదీ అరేబియా తదితర దేశాలు కూడా ఈ విధానాన్ని అనుసరిస్తున్నాయి. 1999 లో యూరప్‌లో మొదట ప్లాస్టిక్ నోటును జారీ చేసిన రొమేనియా, ఆ తరువాత 2003 నాటికి ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌ల తర్వాత పాలిమర్‌కు పూర్తిగా మారిన మూడవ దేశంగా అవతరించింది. బ్రూనై డాలర్ (2006), నైజీరియన్ నైరా (2007), పాపువా న్యూ గినియా కినా (2008), కెనడియన్ డాలర్ (2013), మాల్దీవియన్ రుఫియా (2017), మారిటానియన్ ఔగుయియా (2017), నికరాగ్వన్ కోర్డోబా (2017), వనాటు వటు (2017), ఈస్టర్న్ కరేబియన్ డాలర్ (2019), పౌండ్ స్టెర్లింగ్ (2021) మరియు బార్బేడియన్ డాలర్ (2022) పూర్తిగా పాలిమర్ నోట్లకు మారిన ఇతర కరెన్సీలలో ఉన్నాయి.పాలిమర్ నోట్లు బయాక్సియల్లీ ఓరియెంటెడ్ పాలీప్రొపైలిన్ (బిఒపిపి) వంటి కృత్రిమ పాలిమర్‌తో తయారు చేయబడిన కరెన్సీ నోట్లు. కాగితపు నోట్లలో లభించని అనేక భద్రతా అంశాలు (మెటామెరిక్ ఇంక్‌ల వినియోగంతో సహా) ఉండడం వీటి ప్రత్యేకత. కాగితపు నోట్ల కంటే పాలిమర్ నోట్లు చాలా ఎక్కువ కాలం మన్నుతాయి. కాగితపు నోట్లతో పోలిస్తే ఇవి పర్యావరణానుకూలమే కాకుండా, తయారీ, నిర్వహణ ఖర్చులు కూడా తక్కువగా ఉంటాయి. పాలిమర్ కరెన్సీ నోట్లను సాంప్రదాయ కాటన్ పేపర్‌కు బదులుగా పలుచని, సులభంగా వంగే ప్లాస్టిక్ పదార్థంతో తయారు చేస్తారు. ఇవి అసాధారణమైన నీటి నిరోధకతను కలిగి ఉంటాయి. ఇవి కాగితపు నోట్ల కంటే రెండు నుండి నాలుగు రెట్లు ఎక్కువ కాలం మన్నుతాయి. వీటిలో పారదర్శక భద్రతాపరమైన చిహ్నాలు, సంక్లిష్ట హోలోగ్రామ్‌ల వంటి నకలు చేయడానికి వీలు లేని కష్టమైన ప్రమాణాలు పొందుపరచడానికి అవకాశం ఉంటుంది. అధిక కాలం పాటు మన్నిక గల ఈ నోట్లను ఎక్కువసార్లు పునఃముద్రించాల్సిన అవసరం లేకపోవడంతో ముద్రణా ఖర్చులే కాకుండా రవాణా, చిరిగిన లేదా చలామణియోగ్యత కోల్పోయిన నోట్లను నాశనం చేసే ప్రక్రియ కోసం అయ్యే ఖర్చు ఆదా అవుతుంది. అయితే వీటిని మొదట్లో ముద్రించడానికి మాత్రం ఎక్కువ ఖర్చు అవుతుంది.నునుపైన, రంధ్రాలు లేని ఉపరితలాలు గల ఈ నోట్లపై తక్కువ బ్యాక్టీరియా చేరే అవకాశం ఉండడంతో అవి పరిశుభ్రంగా ఉంటాయి. అయితే, నాణేనికి ఒకవైపు బొమ్మ, మరోవైపు బొరుసు ఉన్నట్లు పాలిమర్ నోట్ల వినియోగంలో అనుకూలతలు, ప్రతికూలతలు ఉన్నాయి. ప్లాస్టిక్ నోట్ల తయారీకి ప్రామాణిక కాగితపు నోట్ల కంటే 30 నుండి 60 శాతం వరకు ఎక్కువ ఖర్చు అవుతుంది. బ్యాంకులు, వ్యాపార సంస్థలు తమ ఎటిఎంలు, నగదు లెక్కింపు యంత్రాలు, సార్టింగ్ వ్యవస్థలను పాలిమర్ నోట్లకు అనుగుణంగా సర్దుబాటు చేసుకోవాలి. సరికొత్త నోట్లు పొడిగా ఉన్నప్పుడు జారుడుగా లేదా తడిగా ఉన్నప్పుడు కొద్దిగా జిగురుగా అనిపించవచ్చు. అంతేకాదు, పాలిమర్ నోట్లను మడిస్తే, అవి శాశ్వతంగా ముడతలు పడవచ్చు. పాలిమర్ నోట్లు పెట్రోలియం ఆధారితమైనవి కావడంతో మొదట్లో ఇవి అధిక కార్బన్ ఉద్గారాలను విడుదల చేయడమే కాక వాటి జీవితకాలం ముగిసిన తర్వాత, పునర్వినియోగ (రీసైక్లింగ్) ప్రక్రియ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. 1982 నుండి హైతీ, కోస్టా రికా, ఐల్ ఆఫ్ మ్యాన్ దేశాలు ప్రయోగాత్మకంగా డుపాంట్ టైవెక్ పాలిమర్ నోట్లను జారీ చేశాయి. ఆధునిక పాలిమర్ నోట్లను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఆస్ట్రేలియా, కామన్వెల్త్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (సిఎస్ఐఆర్ఒ), యూనివర్సిటీ ఆఫ్ మెల్బోర్న్ సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. ఇవి మొదట 1988లో ఆస్ట్రేలియాలో కరెన్సీగా జారీ చేయబడ్డాయి. ప్రపంచంలో కాగితపు నగదు (పేపర్ కరెన్సీ) మొట్టమొదటగా 7వ శతాబ్దంలో చైనాలోని టాంగ్ రాజవంశం కాలంలో ప్రారంభమైంది. ఆ సమయంలో వ్యాపారులు వర్తకం కోసం బరువైన రాగి నాణేల దండలకు బదులుగా తేలికైన కాగితపు రసీదులను ఉపయోగించడం ప్రారంభించారు. ఆ తరువాత 11వ శతాబ్దంలో సాంగ్ రాజవంశం వాణిజ్య లావాదేవీలను సులభతరం చేయడానికి 'జియావోజీ' అనే పేరుతో ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా ప్రభుత్వం జారీ చేసిన కాగితపు నోట్లను ప్రవేశపెట్టింది. 13వ శతాబ్దం నాటికి మార్కో పోలో వంటి యాత్రికుల ద్వారా కాగితపు నగదు పద్ధతి ప్రపంచవ్యాప్తంగా విస్తరించి, శతాబ్దాల తర్వాత ఐరోపా దేశాలు కాగితపు కరెన్సీని స్వీకరించడానికి ప్రేరణగా నిలిచింది. 1770లో బ్యాంక్ ఆఫ్ హిందూస్తాన్, జనరల్ బ్యాంక్ ఆఫ్ బెంగాల్ అండ్ బీహార్ వంటి యూరోపియన్లచే నిర్వహించబడే ప్రైవేట్ ఏజెన్సీ సంస్థలు, భారతదేశంలో మొట్టమొదటి సారి

# 100 శాతం టెలికాం కనెక్టివిటీ

విజయవాడ,ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా కమ్యూనికేషన్ రంగాన్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన అడుగులు వేస్తోంది. రాష్ట్రంలోని ప్రతీ మారుమూల గ్రామానికి, గిరిజన ప్రాంతాలకు సైతం నెట్‌వర్క్ సౌకర్యాన్ని చేర్చడం ద్వారా 100 శాతం టెలికాం కనెక్టివిటీని సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా టెలికాం ఆపరేటర్లను మరియు టవర్ల ఏర్పాటును ప్రోత్సహించేందుకు ఎన్నడూ లేని విధంగా భారీ రాయితీలను, సరికొత్త రాయితీ విధానాన్ని ప్రభుత్వం తెరపైకి తీసుకువచ్చింది.ఈ మెగా ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు మొబైల్ టవర్ల ఏర్పాటుకు ఎలాంటి అద్దె లేకుండా ఉచితంగా ప్రభుత్వ భూములను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనితో పాటు సదరు టెలికాం టవర్లకు అత్యంత తక్కువ ధరకే రాయితీపై విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖను ఆదేశించింది. టెలికాం ఆపరేటర్ల నుండి వచ్చే ప్రతిపాదనలను ఎప్పటికప్పుడు వేగంగా పరిశీలించి, ఎక్కడా జాప్యం లేకుండా టవర్ల ఏర్పాటుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో టవర్ల ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ భూములను

# ఒంటరిగా బరిలోకి జనసేన

హైదరాబాద్, తెలంగాణలో జనసేనతో పొత్తు లేదని బిజెపి సంకేతాలు ఇచ్చింది. ఢిల్లీ వేదికగా తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో ప్రత్యేక భేటీ జరిగింది. అయితే అక్కడే జనసేనతో పొత్తుపై చర్చ జరిగింది. అయితే జనసేనతో పొత్తు అనేది ఏపీకి మాత్రమే పరిమితం అని.. తెలంగాణలో లేదని క్లారిటీ ఇచ్చింది బిజెపి. : తెలంగాణలో జనసేనతో పొత్తు లేదని బిజెపి సంకేతాలు ఇచ్చింది. ఢిల్లీ వేదికగా తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో ప్రత్యేక భేటీ జరిగింది. అయితే అక్కడే జనసేనతో పొత్తుపై చర్చ జరిగింది. అయితే జనసేనతో పొత్తు అనేది ఏపీకి మాత్రమే పరిమితం అని.. తెలంగాణలో లేదని క్లారిటీ ఇచ్చింది బిజెపి. దీంతో సొంతంగానే పోటీకి సిద్ధమవుతోంది జనసేన తెలంగాణలో. త్వరలో జరిగే గ్రేటర్ ఎన్నికలతో పాటు ప్రభావం చూపించగలిగిన జిల్లాల్లో ప్రాదేశిక ఎన్నికల్లో సైతం పోటీ చేయాలని చూస్తోంది జనసేన. అయితే ఉన్నట్టుండి బిజెపి జనసేన విషయంలో ఆ ఆలోచన చేయడానికి కారణం ఏంటనే ప్రశ్న వినిపిస్తోంది. భారత రాష్ట్ర సమితి తో బిజెపి పొత్తు ఉంటుందన్న పరిణామ క్రమంలోనే జనసేన ను దూరం పెట్టినట్లు తెలుస్తోంది. అయితే జనసేన మాత్రం ఒంటరి పోరాటానికి అన్ని ఏర్పాట్లు మొదలుపెట్టినట్లు సమాచారం.వాస్తవానికి ఏపీ మాదిరిగా తెలంగాణలో రాజకీయాలు ఉండవు. బిజెపి ఆది నుంచి స్వంతంగా ఎదిగేందుకు ప్రయత్నాలు చేస్తూ వస్తోంది. కానీ ఆశించిన స్థాయిలో ఆ ప్రయత్నాలు ఏవి ఫలించడం లేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం గట్టి ప్రభావం చూపింది. అధికార కాంగ్రెస్ పార్టీతో సమానంగా ఎనిమిది పార్లమెంట్ స్థానాలను తెచ్చుకుంది. అయితే బిజెపి అంతలా ప్రభావం చూపడానికి కారణం భారత రాష్ట్ర సమితి బలహీనం కావడమే. అయితే ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో బిజెపి బలపడలేదు. ఆ బలాన్ని భర్తీ చేయాలంటే భారత రాష్ట్ర సమితితో పొత్తు బిజెపికి అవసరం. అదే సమయంలో పూర్వవైభవం దిశగా అడుగులు వేయాలంటే ఓట్లతో పాటు సీట్లు పెంచుకోవడం భారత రాష్ట్ర సమితికి అవసరం. అందుకే ఆ రెండు పార్టీలు ఇప్పుడు పరస్పరం ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. జనసేన ను బిజెపి దూరం పెట్టడానికి అదే ప్రధాన కారణం అని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి.తెలంగాణలో మొన్న ఆ మధ్యన జరిగిన పరిణామాలు తెలియనివి కావు. పవన్ కళ్యాణ్ ను తెలంగాణ నుంచి కొంతమంది వ్యతిరేకించడం ప్రారంభించారు. దీంతో తెలంగాణలో కార్యకలాపాలు మొదలు పెట్టింది జనసేన. హైదరాబాదులో రాష్ట్ర కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. అయితే బిజెపితో పొత్తు ఉంటుందన్న తరుణంలోనే ఇలా చేస్తున్నారని అంతా భావించారు. కానీ భారతీయ జనతా పార్టీ ఆలోచన మరోలా ఉంది. అందుకే జనసేనతో పొత్తు విషయంలో క్లారిటీ ఇచ్చింది. కానీ ఏపీ అనుభవాల నేపథ్యంలో ఒంటరిగా ముందు పోటీ చేసి.. ఓట్ల శాతాన్ని పెంచుకుంటే ఇతర పార్టీలు పొత్తుకు ముందుకు వస్తాయని.. అందుకే ఒంటరిగా ముందుకు వెళ్దామని జనసేన వర్గాలు ఒక నిర్ణయానికి వచ్చాయి. సెటిలర్స్ అధికంగా ఉన్న ప్రాంతాలతో పాటు అభిమానులు ఉన్నచోట పార్టీని మరింత బలోపేతం చేయాలని జనసేన భావిస్తోంది.

# భారత్,ఫ్రాన్స్ రఫెల్ డీల్

న్యూఢిల్లీ,భారత ఎయిర్‌ఫోర్స్ యుద్ధ విమానాల కొరతను తీర్చడానికి ఫ్రాన్స్ సమర్పించిన రూ.3.25 లక్షల కోట్ల రఫేల్ ప్రతిపాదన కేవలం కొనుగోలు ఒప్పందం మాత్రమే కాదు. ఇది మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర భారత్ దిశగా ముఖ్యమైన అడుగు. 114 జెట్లలో 94 దేశంలోనే తయారు చేస్తామని ఫ్రాన్స్ తెలిపింది. దీంతో టెక్నాలజీ బదిలీ, స్థానిక ఉత్పత్తి, పరిశ్రమలకు భారీ అవకాశాలు కలుగుతాయి.ఫ్రాన్స్ ప్రతిపాదన ప్రకారం మొత్తం 114 రఫేల్ జెట్లలో 94 భారత్‌లోనే ఉత్పత్తి అవుతాయి. కొన్ని విమానాలు ఫ్లై?అవే కండిషన్‌లో వస్తాయి, మిగతావి దేశీయ భాగస్వామ్యంతో తయారవుతాయి. ఇది గత రఫేల్ ఒప్పందాలకు భిన్నంగా, మొట్టమొదటిసారి రఫేల్‌ను ఫ్రాన్స్ వెలుపల పెద్ద ఎత్తున తయారు చేయబోతోంది. టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ ద్వారా ఎయిర్‌ఫ్రేమ్, ఇంజిన్లు, అవయోనిక్స్‌లో స్థానిక కంటెంట్ 60 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల భారత్ స్వయంప్రతిపత్తి పెరుగుతుంది, భవిష్యత్తులో సొంత యుద్ధ విమానాల అభివృద్ధికి అనుభవం లభిస్తుంది.ఈ ఒప్పందం ఆమోదమైతే భారతీయ కంపెనీలకు దాదాపు రూ.1.6 లక్షల కోట్ల వ్యాపారం వస్తుందని అంచనా. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, లార్సెన్ ? టూబ్రో వంటి సంస్థలు ఎయిర్‌ఫ్రేమ్, ఇంజిన్ అసెంబ్లీ, అవయోనిక్స్, ఆయుధాల ఇంటిగ్రేషన్‌లో పాల్గొంటాయి. ఫ్రెంచ్ కంపెనీలు డసాల్ట్, సఫ్రాన్, థేల్స్, ఎంబీడీఏ భారత భాగస్వాములతో కలిసి పనిచేస్తాయి. ఇది ఏరోస్పేస్ సప్లై చైన్‌ను బలోపేతం చేసి, ఉపాధి సృష్టి, నైపుణ్య అభివృద్ధికి దోహదం చేస్తుంది. స్థానిక ఆయుధాలు ఇంటిగ్రేట్ చేసుకునే అవకాశం కూడా ఉంది.రఫేల్ విడిభాగాల తయారీ కేంద్రం హైదరాబాద్‌లో ఏర్పాటవుతుంది. ఇప్పటికే టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌తో ఫ్యూజ్‌లేజ్(ఫ్యూస్‌లేజ్) తయారీ ఒప్పందాలు ఉన్నాయి. ఇది హైదరాబాద్‌ను ఏరోస్పేస్ హబ్‌గా మరింత బలపరుస్తుంది. ఇంజన్ మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్(ఎంఆర్‌వో) సౌకర్యాలు కూడా ఇక్కడే రావచ్చు. దీనివల్ల తెలంగాణలో ఉపాధి, పెట్టుబడులు పెరుగుతాయి.భారత వాయుసేన స్క్వాడ్రన్ల సంఖ్య తగ్గుతున్న నేపథ్యంలో ఈ జెట్లు ముఖ్యం. ప్రస్తుతం ఉన్న 36 రఫేల్‌లకు జోడించి మొత్తం సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. 4.5 జనరేషన్ మల్టీ?రోల్ సామర్థ్యం, ఆధునిక ఆయుధ వ్యవస్థలు శత్రు దేశాలపై నిరోధక శక్తిని పెంచుతాయి. టెక్నాలజీ బదిలీతో భవిష్యత్తు స్వదేశీ విమానాల అభివృద్ధికి కూడా సహాయపడుతుంది.ప్రతిపాదనను రక్షణ శాఖ, వాయుసేన పరిశీలిస్తున్నాయి. ధర, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ స్థాయి, ఇండిజినస్ కంటెంట్, ఆయుధాల ఇంటిగ్రేషన్‌పై చర్చలు జరుగుతాయి. ఒప్పందం ఆమోదమైతేనే పూర్తి ప్రయోజనాలు వస్తాయి. ఈ ప్రతిపాదన భారత్ రక్షణ సామర్థ్యం పెంచడంతోపాటు ఆర్థిక, పారిశ్రామిక లబ్ధిని కలిగిస్తుంది. భారత?ఫ్రాన్స్ రక్షణ సహకారంలో కొత్త అధ్యాయం మొదలవుతుంది.

# అక్టోబర్‌లో డీఎస్సీ నోటిఫికేషన్..

విజయవాడ, ఏపీలోని నిరుద్యోగ యువతకు గుడ్ న్యూస్. అక్టోబర్ నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. అక్టోబర్ నెలలో నోటిఫికేషన్ విడుదల, డిసెంబర్ నెలలో పరీక్షలు ఉంటాయని ఏపీ విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా తెలిపారు. డీఎస్సీ 2025పై వస్తున్న ఆరోపణలకు సంబంధించి విద్యాశాఖ అధికారులు శుక్రవారం మరోసారి క్లారిటీ ఇచ్చారు. ఎంపికైన అభ్యర్థులు ఈ దుష్ప్రచారాన్ని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ శుభవార్త చెప్పింది. వచ్చే అక్టోబర్ నెలలో మరో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఏపీ విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా తెలిపారు. డిసెంబర్‌లో డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మెగా డీఎస్సీపై వస్తున్న ఆరోపణల మీద ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ శుక్రవారం మరోసారి వివరణ ఇచ్చింది. అమరావతి సచివాలయంలో విలేకర్లతో మాట్లాడిన తమీమ్ అన్సారియా.. డీఎస్సీ 2025పై వస్తున్న ఆరోపణలను ఖండించారు. డీఎస్సీ 2025 ద్వారా 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేశామని.. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో అత్యంత పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించామన్నారు. అయినప్పటికీ డీఎస్సీ 2025పై నిరాధార ఆరోపణలు, దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు.

# కాక్రోచ్ కు నిధులెలా వస్తున్నాయ్...

న్యూఢిల్లీ,కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) గురించి రోజువారీగా కొత్త వివరాలు బయటకు వస్తున్నాయి. పార్టీ నాయకత్వం, దాని వ్యూహాలు, వెనుక ఉన్న శక్తులు, అసలు ప్రణాళిక ఏమిటి అన్న అంశాలపై అనేక సందేహాలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా ప్రముఖ నాయకుల వ్యక్తిగత జీవితాలు, ఆదాయ వనరులు, జీవన ప్రమాణాలు ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఉద్యమాలు నడిపే వారు సమాజానికి జవాబుదారులుగా ఉండాలని ఆశించే సందర్భంలో, వారి స్వంత నేపథ్యాలపై స్పష్టత లేకపోవడం చర్చకు దారితీస్తోంది.సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే గురించి అనేక ప్రశ్నలు వస్తున్నాయి. ఆయన తండ్రి మహారాష్ట్ర ప్రభుత్వ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తూ, నెలకు సుమారు 50 వేల నుంచి 60 వేల రూపాయల వేతనం పొందుతున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ శంభాజీనగర్‌లో ఉన్న ఆయన భవనం రెండు కోట్ల రూపాయలకు పైగా విలువైనదిగా అంచనా. ఆ ఇంట్లోని సదుపాయాలు, అక్కడ జరిగిన సమావేశాల్లో మద్యం సరఫరా విధానం, పెద్ద ఎత్తున కార్లన రాకపోకలు వంటి వివరాలు చూస్తే, ఆదాయానికి తగిన జీవనస్థాయి లేదన్న సందేహం ఏర్పడుతోంది.అభిజిత్ అమెరికాలో చదువు, కోర్సు, సహచరులు, విశ్వవిద్యాలయం గురించి స్పష్టమైన సమాధానాలు ఇవ్వడం లేదు. ప్రశ్నలు వచ్చినప్పుడు "సమయం వచ్చినప్పుడు చెబుతాను" అని దాటవేస్తున్నారు. జార్ఖండ్ ఉద్యమానికి మద్దతు ఇవ్వలేనని జ్వరం కారణంగా చెప్పిన మరుసటి రోజే మహారాష్ట్రలో సమావేశం నిర్వహించి కోక్ తాగిన వివరాలు కూడా అసమతుల్యతను చూపుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిధుల మూలం ఏమిటి, కుటుంబ ఆదాయంతో ఇంతటి జీవనశైలి ఎలా సాధ్యమవుతుంది అన్న ప్రశ్నలు సహజంగా తలెత్తుతున్నాయి.ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ నాయకురాలు నేహా బోరా 26 రోజుల పాటు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఆమె వయసు 29, గత 15 ఏళ్లుగా ఇంటికి దూరంగా ఉన్నట్లు తెలిపారు. అంటే కౌమార దశ నుంచే వామపక్ష ఉద్యమాల్లో చురుకుగా ఉన్నట్లు అర్థం. అయితే చదువు, ఫీజులు, నిర్వహణ ఖర్చులు ఎవరు భరిస్తున్నారు, ఎలా జీవిస్తున్నారు అన్న విషయాల్లో స్పష్టత లేదు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత ఆమె చేసిన నృత్యం, 20 నిమిషాలపాటు అనర్గళంగా మాట్లాడిన విధానం చూస్తే, దీర్ఘకాల నిరాహార దీక్ష చేసిన వ్యక్తి శారీరక స్థితికి సరిపోని ఉత్సాహం కనిపించింది. ఇలాంటి వైరుధ్యాలు ప్రజల్లో అనుమానాలను పెంచుతున్నాయి.సౌరభ్ దాస్ ఢిల్లీలో అత్యంత ఖరీదైన ప్రాంతంలో నివసిస్తున్నారు. నెలకు పది లక్షల రూపాయల అద్దె ఉన్న ఇంట్లో ఉంటున్నారు. దీనిని ఆయన తిరస్కరించడం లేదు. ఇల్లు ఆయన పేరిట లేకపోయినా, ముగ్గురు ఉద్యోగులు, కారు సౌకర్యాలతో విలాసవంతంగా జీవిస్తున్నారు. ఉద్యమ కార్యకర్తగా ఇంతటి జీవనస్థాయి ఎలా సాధ్యమవుతుంది అన్నది మరో ముఖ్య ప్రశ్న.సీజేపీ రిజిస్టర్డ్ బాడీ కాదు. ఆర్ఎస్ఎస్‌ను రిజిస్టర్ చేయాలని కోరే వారు సీజేపీ విషయంలో అదే ప్రమాణాన్ని వర్తింపజేయకపోవడం గమనార్హం. ఉద్యమాలకు, సమావేశాలకు, ప్రయాణాలకు అవసరమైన నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి, నాయకులు ఎలా మనుగడ సాగిస్తున్నారు అన్న విషయాల్లో పారదర్శకత లేకపోవడం విమర్శలకు దారితీస్తోంది.ప్రజలను ప్రశ్నించే వారు తమ వ్యక్తిగత, ఆర్థిక విషయాల్లో కూడా స్పష్టంగా ఉండాలి. సైలెన్స్ లేదా దాటవేత ధోరణి అనుమానాలను మరింత పెంచుతుంది. సమాజం ఆశించేది సమాధానాలు, స్పష్టత, జవాబుదారీతనం. ఇవి లేకపోతే ఏ ఉద్యమమైనా విశ్వసనీయతను కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

# అనంతపురం పాలిటిక్స్ హీట్..

అనంతపురం,అనంతపురం జిల్లా పెద్దవడుగూరులో అధికార టీడీపీ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల పోటాపోటీ కార్యక్రమాలతో రాజకీయ ఉత్కంఠ పీక్స్‌కు చేరింది. డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయంటూ వైసిపి శ్రేణులు రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగానే వైసిపి తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పెద్దవడుగూరులో ఒక భారీ నిరసన దీక్ష చేపట్టేందుకు అన్ని సన్నాహాలు చేసుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే టీడీపీ సీనియర్ నేత, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి సైతం అదే నియోజకవర్గ పరిధిలోని పెద్దవడుగూరులో స్థానిక టీడీపీ కార్యకర్తలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేపుతోంది.ఒకే లొకేషన్‌లో అటు ప్రతిపక్ష వైసీపీ నిరసన దీక్ష, ఇటు అధికార టీడీపీ కీలక నేత జేసీ ప్రభాకర్ రెడ్డి సమావేశం ఒకేసారి జరగనుండటంతో పెద్దవడుగూరులో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరు పార్టీల క్యాడర్ భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీస్ యంత్రాంగం పూర్తిగా అప్రమత్తమైంది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు పట్టణంలోని ముఖ్య కూడళ్లలో భారీగా పోలీసు బలగాలను మోహరించి నిఘా పెట్టారు. డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న అక్రమాల ఆరోపణలను తిప్పికొట్టేలా టీడీపీ నేతలు వ్యూహాలు రచిస్తుండటంతో తాడిపత్రి పాలిటిక్స్ మరోసారి హీటెక్కాయి.రాజకీయంగా ఎప్పుడూ సెన్సేషనల్ గా ఉండే తాడిపత్రి నియోజకవర్గంలో జేసీ ప్రభాకర్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డిల తాజా కదలికలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ నిరసన దీక్షకు పోలీసులు అనుమతి ఇస్తారా, లేదా అనే ఉత్కంఠ నడుస్తుండగానే ఇరు వర్గాలు సవాల్ ప్రతిసవాళ్లకు దిగడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. ఒకే చోట జరుగుతున్న ఈ రెండు భిన్నమైన పొలిటికల్ యాక్టివిటీస్ రాబోయే గంటల్లో ఎలాంటి మలుపులు తిరుగుతాయోనని జిల్లా వ్యాప్తంగా సర్వత్రా చర్చ సాగుతోంది. ఈ ఉద్రిక్త పరిస్థితులను అదుపు చేయడానికి పోలీసులు ఇరు పార్టీల ముఖ్య నేతలను ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేసే అవకాశాలు కూడా ఉన్నట్లు స్థానిక వర్గాల నుండి సమాచారం అందుతోంది.

## పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే, ప్రజలు సహకరించాలి


జమ్మికుంట,జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని జమ్మికుంట పట్టణంలో సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్, తెలిపారు.ఈ సందర్భంగా జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, మేనేజర్ జి. రాజిరెడ్డి, జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్,లను వారి కార్యాలయాల్లో కలిసి సర్వేకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. సర్వే లక్ష్యాలు, ప్రాముఖ్యతను వివరించారు.దేశంలో ఉపాధి, నిరుద్యోగం, కార్మిక శక్తి భాగస్వామ్యం, స్వయం ఉపాధి తదితర అంశాలకు సంబంధించిన విశ్వసనీయమైన గణాంకాలను రూపొందించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సర్వేలో మొదటి దశలో కుటుంబాల సాధారణ వివరాలను నమోదు చేసిన అనంతరం, ఎంపికైన కుటుంబాలను మూడు నెలల పాటు ప్రతి నెలా ఒకసారి సందర్శించి మొబైల్ ట్యాబ్ ద్వారా సమాచారాన్ని సేకరిస్తామని తెలిపారు.కుటుంబ సభ్యుల విద్యార్హతలు, విద్యాభ్యాసం, వృత్తి విద్య, ఉద్యోగం, స్వయం ఉపాధి, రోజువారీ కూలి పనులు, పని చేసిన గంటలు, వేతన వివరాలు, మహిళల ఆదాయ వనరులు తదితర వివరాలను నమోదు చేస్తామని పేర్కొన్నారు. అలాగే జొమాటో, స్విగ్గీ, రాపిడో, ఓలా, ఉబెర్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల

# నిరసనల అణచివేతే పరిష్కారమా?



హైదరాబాద్,ప్రజల సమస్య నిజమైనదైతే, నాయకత్వం విశ్వసనీయమైతే, ఉద్యమం మరింత బలపడే అవకాశమూ ఉంటుంది. అందుకే ప్రజాస్వామ్యంలో సంభాషణ, సంప్రదింపులు, పారదర్శకత అత్యంత అవసరం. ఇక్కడ ప్రతిపక్షాల బాధ్యత కూడా తక్కువ కాదు. ప్రజా సమస్యలను రాజకీయ లాభనష్టాల కోణంలో కాకుండా పరిష్కార దిశగా తీసుకెళ్లాలి. నిరసనలను కేవలం ప్రభుత్వ వ్యతిరేక ప్రచార వేదికగా మార్చడం కూడా ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. అలాగే ప్రభుత్వం ప్రతి విమర్శను దేశద్రోహంగా, విదేశీ కుట్రగా చిత్రీకరించడం కూడా ప్రజాస్వామ్య సంస్కృతికి హానికరం. ఐరమ్ షర్మిలా నుంచి సోనమ్ వాంగ్‌చుక్ వరకు వచ్చిన ప్రతి ఉద్యమం ఒకే సందేశాన్ని ఇస్తోంది.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాగొంతుకకు అత్యంత శక్తివంతమైన ఆయుధం నిరసన. ఓటు వేసిన తర్వాత కూడా ప్రజలు తమ అసంతృప్తిని, బాధను, డిమాండ్లను ప్రభుత్వానికి వినిపించే రాజ్యాంగబద్ధమైన మార్గమే శాంతియుత ఆందోళన. అయితే భారత రాజకీయ చరిత్రను పరిశీలిస్తే, ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఒకే ధోరణి కనిపిస్తుంది. అది నిరసనలను వినడం కంటే వాటిని కాలయాపనతో బలహీనపరచడం. చివరికి ఉద్యమం అలసిపోతుందని, ప్రజలు చెదిరిపోతారని, నాయకత్వం నీరుగారుతుందని అధికార యంత్రాంగం భావిస్తుంది. ఇదే అంశాన్ని ఇటీవల సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్ష, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థి ఉద్యమాల నేపథ్యంలో మళ్లీ దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది.భారత ప్రజాస్వామ్య చరిత్రలో నిరసనలను ఎదుర్కొన్న ప్రభుత్వాల వైఖరిలో పెద్దగా మార్పు కనిపించదు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా, ప్రజల ఆందోళనలను తక్షణమే పరిష్కరించేందుకు ముందుకు రావడం కంటే వాటిని చట్టపరమైన చర్యలు, పరిపాలనా నియంత్రణలతో ఎదుర్కొనే ధోరణే ఎక్కువగా కనిపించింది. మణిపూర్‌కు చెందిన ఐరమ్ షర్మిలా పదహారేళ్ల పాటు సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం (ఎఎఫ్ఎస్‌పిఎ) రద్దు కోసం నిరాహార దీక్ష చేసినా, ఆమె డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోలేదు. అరెస్టులు, బలవంతపు ఆహార సరఫరా వంటి చర్యలతో ఉద్యమాన్ని నియంత్రించేందుకు ప్రయత్నించింది.నేడు లడఖ్‌కు చెందిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన ఉద్యమం సందర్భంలోనూ ప్రభుత్వ స్పందనపై ఇలాంటి ప్రశ్నలే తలెత్తుతున్నాయి. ప్రజాస్వామ్యంలో విభేదాలను అణచివేయడమే ప్రభుత్వ బాధ్యతా? లేక ప్రజలతో సంభాషించి వారి ఆందోళనల సారాంశాన్ని అర్థం చేసుకుని పరిష్కార మార్గాలను అన్వేషించడమా? అనే మౌలిక ప్రశ్న మరోసారి జాతీయ చర్చకు కేంద్రబిందువైంది. ప్రజాస్వామ్య వ్యవస్థ బలప్రయోగంతో కాదు, పరస్పర విశ్వాసం, సంభాషణ, రాజ్యాంగబద్ధమైన చర్చలతోనే మరింత బలపడుతుందనే విషయాన్ని ఈ పరిణామాలు మరోసారి గుర్తు చేస్తున్నాయి.ప్రభుత్వం దృష్టిలో చట్టవ్యవస్థ, శాంతిభద్రతలు కాపాడటం బాధ్యత. కానీ అదే సమయంలో శాంతియుత నిరసన హక్కును కూడా గౌరవించాల్సిన బాధ్యత ఉంది. ఈ రెండింటి మధ్య సమతుల్యత కోల్పోయినప్పుడు ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది. ఉద్యమాలను బలప్రయోగంతో అణచివేయడం తాత్కాలికంగా ఫలితాన్నివ్వొచ్చు. కానీ ప్రజల మనసుల్లో అసంతృప్తిని మరింత పెంచుతుంది. భారత రాజకీయ చరిత్రలో రైతు ఉద్యమం దీనికి పెద్ద ఉదాహరణ. మొదట కేంద్ర ప్రభుత్వం ఉద్యమాన్ని పెద్దగా పట్టించుకోలేదు. కాలక్రమేణా ఉద్యమం బలపడింది. ఏడాది పాటు కొనసాగిన ఆందోళన తర్వాత చివరకు మూడు వ్యవసాయ చట్టాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. అంటే ప్రజాస్వామ్యంలో దీర్ఘకాలిక, శాంతియుత ఉద్యమాలకు ప్రభావం ఉంటుందని చరిత్ర చెబుతోంది.అయితే మరో కోణాన్ని కూడా విస్మరించలేం. ప్రతి నిరసన సమంజసమేనా? ప్రతి డిమాండ్‌ను ప్రభుత్వం వెంటనే అంగీకరించాలా? అనే ప్రశ్నలు కూడా ఉన్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని వినాలి. అదే సమయంలో విధాన నిర్ణయాలను చట్టపరమైన, రాజ్యాంగబద్ధమైన ప్రక్రియల ద్వారా తీసుకోవాలి. కాబట్టి సంభాషణే సరైన మార్గం. నిర్లక్ష్యం కాదు, అణచివేత కాదు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల్లో ఒక ముఖ్యమైన అంశం సోషల్ మీడియా ప్రభావం. ఒకప్పుడు ఉద్యమం స్థానికంగా ఉండేది. ఇప్పుడు నిమిషాల్లో దేశవ్యాప్తంగా వ్యాపిస్తోంది. వీడియోలు, ప్రత్యక్ష ప్రసారాలు, ప్రజల స్పందన ఉద్యమానికి కొత్త శక్తిని ఇస్తున్నాయి. అందువల్ల కేవలం పోలీసు చర్యలతో ఉద్యమాన్ని ఆపేయడం గతంలో కంటే కష్టమైంది.ప్రభుత్వాలు సాధారణంగా 'సమయం గడిస్తే ఉద్యమం చల్లారిపోతుంది' అనే వ్యూహాన్ని అనుసరిస్తుంటాయి. కానీ అది ఎప్పుడూ పనిచేయదు. ప్రజల సమస్య నిజమైనదైతే, నాయకత్వం విశ్వసనీయమైతే, ఉద్యమం మరింత బలపడే అవకాశమూ ఉంటుంది. అందుకే ప్రజాస్వామ్యంలో సంభాషణ, సంప్రదింపులు, పారదర్శకత అత్యంత అవసరం. ఇక్కడ ప్రతిపక్షాల బాధ్యత కూడా తక్కువ కాదు. ప్రజా సమస్యలను రాజకీయ లాభనష్టాల కోణంలో కాకుండా పరిష్కార దిశగా తీసుకెళ్లాలి. నిరసనలను కేవలం ప్రభుత్వ వ్యతిరేక ప్రచార వేదికగా మార్చడం కూడా ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. అలాగే ప్రభుత్వం ప్రతి విమర్శను దేశద్రోహంగా, విదేశీ కుట్రగా చిత్రీకరించడం కూడా ప్రజాస్వామ్య సంస్కృతికి హానికరం. ఐరమ్ షర్మిలా నుంచి సోనమ్ వాంగ్‌చుక్ వరకు వచ్చిన ప్రతి ఉద్యమం ఒకే సందేశాన్ని ఇస్తోంది. అధికారాలు శాశ్వతం కావు. కానీ ప్రజల ఆకాంక్షలు శాశ్వతం. నిరసనలను అణచివేయడం ద్వారా సమస్యలు ముగియవు. వాటిని వినడం, అర్థం చేసుకోవడం, పరిష్కారం చూపడం ద్వారానే ప్రజాస్వామ్యం బలపడుతుంది.

# జెన్ జెడ్‌కు ఆర్ఎస్ఎస్ వత్తాసు...



న్యూఢిల్లీ,నీట్ పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీ, ఇతర అవకతవకలపై కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో దేశంలోని విద్యార్థులు, యువత కదంతొక్కి కేంద్ర ప్రభుత్వం గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన సంగతి తెలిసిందే. కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్లను ఎట్టకేలకు ప్రభుత్వం ఆమోదించి ఒత్తిడినుంచి బయటపడగలిగింది. ఈ నేపథ్యంలో గురువారం ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ జెన్ జెడ్ గురించి చేసిన వ్యాఖ్యలు ఆ సంస్థ వైఖరిలో మార్పుకు సంకేతాలు సూచిస్తున్నాయి. హిందుత్వ భావజాల ప్రధాన సిద్ధాంతమే రాష్ట్రీయ స్వయం సేవక్‌కు పునాది. బిజెపికి సైద్ధాంతిక మార్గదర్శి ఆర్ఎస్ఎస్‌యే అన్నది వాస్తవం. అలాంటి సంస్థకు అధిపతిగా ఉన్న భగవత్ 'జెన్ జెడ్ యువత మనవాళ్లే. మన తరవాతి తరం వారిదే. దేశభక్తి, సమాజ సేవపట్ల వారికి నిజమైన నిబద్ధత ఉంది. వారి నిరసనలను దేశ వ్యతిరేక చర్యలుగా చూడకుండా, వారి ఆలోచనలు, అసంతృప్తి, దేశంపట్ల వారి నిబద్ధతను అర్థం చేసుకుని వారితో చర్చలు జరపాల్సిన అవసరం ఉందని' భగవత్ మోడీ ప్రభుత్వానికి హితోపదేశం చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ అంటే విముఖత చూపించే కేంద్ర ప్రభుత్వానికి భగవత్ సూచనలు చెంపపెట్టు అని చెప్పక తప్పదు.అయితే భగవత్ సూచనల ప్రభావం జెన్ జెడ్, జెన్ ఆల్ఫా వర్గాలపై ఎలాంటి ప్రభావం చూపలేదు. ఎందుకంటే కేంద్ర పాలకులు, బిజెపి వర్గాలు వారిని దేశద్రోహులు, దేశవ్యతిరేకులు, విదేశీ సంస్థలనుంచి డబ్బులు తీసుకుని దేశాన్ని బలహీన పర్చడానికి ప్రయత్నిస్తున్నారని ముమ్మరంగా ప్రచారం సాగించారు. వీటిని జెన్ జెడ్ పట్టించుకోవడం లేదు. తాము లేవనెత్తుతున్న సమస్యలను రాజ్యాంగబద్ధంగా, నిజాయితీగా అర్థం చేసుకుని పరిష్కరించడానికి ప్రయత్నించాలని జెన్ జెడ్ యువత ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తోంది. గత ఐదేళ్లలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కొన్ని ముఖ్యమైన, వివాదాస్పద అంశాలపై ఆర్ఎస్ఎస్ వైఖరిలో కొత్త కోణాన్ని వ్యక్తీకరిస్తున్నారు. ఉదాహరణకు భారత దేశంలో నివసించే ప్రతి ఒక్కరికీ వారు ఏ మతాన్ని అనుసరించినా, సుమారు 40,000 సంవత్సరాల క్రితం వరకు ఒకే మూలమైన డిఎన్ఎ ఉందని పలుమార్లు భగవత్ ప్రస్తావించడం గమనార్హం. అంటే హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు అనే తేడాల కంటే భారతీయుల మూలాలన్నీ ఒకటే అని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. అలాగే ప్రతీ మసీదు అడుగున శివలింగం ఉందా లేదా అని వెతకడం మానాలని సూచించారు. ఇది మత సామరస్యానికి దోహదం చేసే వ్యాఖ్య. ఈ వ్యాఖ్యలన్నీ ఆర్ఎస్ఎస్‌లో మార్పులుగా కనిపిస్తున్నాయి. సంప్రదాయ వాదులకు ఈ వ్యాఖ్యలు రుచించకపోయినా, ఉదారవాదులు మాత్రం ఈ మార్పులను ఆశాజనకంగా భావిస్తున్నారు.ఈ మార్పులను గమనించి ప్రముఖ ముస్లిం నేతలు ఐదుగురు భగవత్‌ను కలిసి చర్చించడానికి ప్రయత్నించారు. ఒకప్పుడు ఆర్ఎస్ఎస్ నాయకత్వాన్ని విమర్శించే వర్గాలు ఇప్పుడు ప్రభుత్వాన్ని స్థిమితంగా నడిపించేలా ప్రభావితం చేయగల వ్యక్తి భగవత్ అని భావిస్తున్నారు. మోడీ ప్రభుత్వానికి క్లిష్ట పరిస్థితులు ఏర్పడినప్పుడు భగవత్ పెద్దన్న పాత్ర వహించి ప్రభుత్వంపై అసంతృప్తిని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. జులై 30న మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో ఎబివిపి కార్యకర్తల సమావేశంలో ఆర్ఎస్ఎస్ సంయుక్త ప్రధాన కార్యదర్శి అతుల్ లిమాయే జెన్ జెడ్ నిరసనలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం జెన్‌జెడ్ యువతలో ఆగ్రహం రగిలించింది. దీన్ని గమనించిన భగవత్ హెచ్ఎంయుఎన్ (ఇండియాస్ ఇంటర్నేషనల్ మూవ్‌మెంట్ టు యునైట్ నేషన్స్) నిర్వహించిన సదస్సుకు హాజరై జెన్ జెడ్ నిరసనకారులకు వ్యతిరేకంగా వచ్చిన విమర్శలను కొట్టి పారేశారు. 'జెన్ జెడ్ నిరసనలపై నాకు నమ్మకం ఉంది. ప్రజాస్వామ్యంలో నిరసన వ్యక్తం చేయడం హక్కు. అది దేశ వ్యతిరేకం కాదు. ప్రజాస్వామ్యంలో నిరసనలు, ఆందోళనలు ఏకాభిప్రాయం ఏర్పడే ప్రక్రియలో ముఖ్యమైన భాగాలు' అని స్పష్టం చేశారు. అంతేకాదు యువతను గౌరవించాలని హితవు పలికారు. అలాగే బిజెపి ఎంపి, నటి కంగనా రనౌత్ జెన్ జెడ్ యువతను దేశవ్యతిరేకులు, దేశద్రోహులు అని తీవ్రంగా విమర్శించడం యువతలో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. అయితే భగవత్ జెన్ జెడ్‌కు మద్దతుగా సానుకూల వ్యాఖ్యలు చేయడంతో ఆమె శుక్రవారం పార్లమెంట్ బయట తన వ్యాఖ్యలను సవరించుకోవలసి వచ్చింది. 'జెన్ జెడ్ మన అతి పెద్ద బలం. ఈ తరం మనకు గర్వకారణం' అని సవరించుకున్నారు. ఇది కేవలం కంగనా రనౌత్ వ్యక్తిగత అభిప్రాయంలో వచ్చిన మార్పు కాదు. ఆర్ఎస్ఎస్ అత్యున్నత నాయకత్వంనుంచి వచ్చిన ఆదేశాల ఫలితమే అని తెలుస్తోంది.మోడీ ప్రభుత్వం ఇంకా తమ పొరపాట్లను సరిదిద్దుకోవడం లేదు. పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా వచ్చి జంతర్‌మంతర్ వద్ద నిరసనకారులపై పోలీస్ దమనకాండకు క్షమాపణ చెప్పాలని, పోలీసులకు ఆమేరకు ఆదేశాలు ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందో వివరించాలని కాంగ్రెస్‌తో సహా విపక్షాలన్నీ కలిసి ఆందోళనలు చేస్తున్నా మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పైగా ఎదురు దాడికి దిగుతోంది. అమిత్ షా వచ్చి సభలో మాట్లాడితే విపక్షాలు తట్టుకోలేవని, అమిత్ షా అంటే ఉగ్రవాదులు హడలెత్తిపోతారని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సమాధానం ఇస్తుండడం ఏమనుకోవాలి? ప్రధాని మోడీ కానీ, అమిత్ షా కానీ ఇంతవరకు పార్లమెంట్ సమావేశాలకు హాజరుకాకుండా మొగం చాటేస్తున్నారు. ఇది ప్రజాస్వామ్య సంప్రదాయమా? ఈ లోటుపాట్లన్నీ తలెత్తి ప్రజల్లో అసంతృప్తి ఎదురైనప్పుడు ఆర్ఎస్ఎస్ ఒక పెద్ద మనిషిలా వ్యవహరిస్తోందని, ఆర్ఎస్ఎస్ గురువైతే మోడీ ప్రభుత్వాన్ని శిష్యుడుగా భావించి దిశానిర్దేశం చేస్తోందన్న అభిప్రాయం వస్తోంది.

## పారమిత హెరిటేజ్ పాఠశాలలో ఘనంగా స్కూల్ క్యాబినెట్ ఎన్నికలు

కరీంనగర్ , పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ సీబీఎస్ఈ పాఠశాలలో శనివారం స్కూల్ క్యాబినెట్ ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించారు. హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌తో పాటు క్రీడలు, క్రమశిక్షణ, సాంస్కృతిక విభాగాల లీడర్లు, డిప్యూటీ లీడర్లను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇ-బ్యాలెట్ విధానంలో ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రక్రియలో విద్యార్థులే బూత్, ఎన్నికల, ప్రిసైడింగ్ అధికారులుగా బాధ్యతలు నిర్వహించడం విశేషం. ముఖ్య అతిథులుగా ఏసీపీ తంగేళ్ల ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ సుగాటి కోటేశ్వర్ రావు, విద్యాసంస్థల అధినేత డా. ఇ. ప్రసాద్ రావు హాజరై విద్యార్థులకు నాయకత్వం, బాధ్యత, క్రమశిక్షణ, ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని, చిన్ననాటి నుంచే ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించడం ద్వారా బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దవచ్చని అతిథులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనూకర్ రావు, రాకేశ్ తదితరులు, ప్రధానోపాధ్యాయుడు గోపీకృష్ణ, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మున్సిపల్,పంచాయతీ ఎన్నికలు

ఒంగోలు ,స్థానిక సంస్థల ఎన్నికల నగారా అతి త్వరలో మోగనుంది. దీనిపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులతో సమావేశమయ్యారు. 2021లో జరిగిన తీరును, ఇప్పుడు జరగనున్న విధానంపై చర్చించారు. కోర్టు కేసుల్లో ఉన్న వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని చెప్పారు. అదేవిధంగా ఈ స్థానిక సంస్థల ఎన్నికలకు బ్యాలట్ బాక్సులు ఉపయోగించాలా? లేక ఈవీఎంలు వాడాలా? అన్న విషయంపై కూడా అధికారులు చర్చించారు. ఎన్నికల తేదీ వచ్చేలోపే అంతా సిద్ధం చేసుకోవాలని ఎన్నికల కమిషనర్ ఆదేశించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏ క్షణమైనా మున్సిపల్, పంచాయతీ ఎన్నికల నగారా మోగొచ్చని.. అధికారులు సిద్ధంగా ఉండాలంటూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అలర్ట్ చేశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు చేసిన ఏర్పాట్లపై ముఖ్య అధికారులతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్, పంచాయతీ ఎన్నికలకు పెండింగ్‌లో ఉన్న అంశాలు, వాటి పరిష్కరానికి తీసుకుంటున్న చర్యలపై పురపాలక, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోనే ఈ ఎన్నికలకు బ్యాలట్ బాక్సులు వినియోగించాలా, ఈవీఎంలు వాడాలా అనే అంశంపై కూడా చర్చించారు.రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ చెప్పారు. కొన్ని చోట్ల కోర్టు కేసులు ఉన్నందున వాటిని పరిష్కరించే దిశగా కూడా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చీఫ్ సెక్రెటరీ వివరించారు. పెండింగ్‌లో 23 కోర్టు కేసులు ఉంటే వాటిల్లో నాలుగు పరిష్కారమయ్యాయి అని తెలిపారు.ఇక పంచాయతీల విషయానికి వస్తే రాష్ట్రంలో మొత్తం 13,359 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 2021లో 354 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించలేదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే ఒక ప్రజంటేషన్ కూడా ఇచ్చారు. పురపాలకశాఖతో సమన్వయం చేసుకుని పెండింగ్ కేసులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఓటర్ల తుది జాబితా ప్రచురణ, పోలీస్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపైనా సిబ్బందిని సన్నద్ధం చేస్తున్నామని అధికారులు తెలిపారు.ఈ ఎన్నికలకు బ్యాలట్ బాక్సులు ఉపయోగించాలా? ఈవీఎంలు వాడాలా? అనే అంశంపై కూడా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులతో చర్చించారు. జిల్లాల వారీగా ఎన్ని బ్యాలట్ బాక్సులు ఉన్నాయి, ఎన్ని ఈవీఎంలు ఉన్నాయి అనే వివరాలను అధికారులు నివేదించారు. 2021లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రూ. 3.5 కోట్ల వరకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించగా.. ఈ ఏడాది ఎంత బడ్జెట్ అవుతుందో కూడా చర్చించారు.

వైజాగ్ వాసులకు ట్రాఫిక్ కష్టాలు తీరినట్టే..

# ఆ 35 కూడళ్లలో సరికొత్తగా!

విశాఖపట్టణం, వైజాగ్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. విశాఖ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదేశాల మేరకు ఇటీవల ఓ సర్వే కూడా నిర్వహించారు. గాజువాక నుంచి కొమ్మాది వరకు అత్యంత క్లిష్టమైన కూడళ్లను పరిశీలించిన అధికారులు 35 కూడళ్ల వద్ద అభివృద్ధి పనులు చేసి ట్రాఫిక్ సమస్యను రూపుమాపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో కూడలిలో రూ. 1.5 కోట్ల నుంచి రూ. 2 కోట్ల వరకు వెచ్చించనున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత వైజాగ్ ప్రాంతం అభివృద్ధి బాట పట్టింది. సాఫ్ట్‌వేర్ కంపెనీలు కూడా ఈ ప్రాంతానికి రావడానికే మొగ్గు చూపుతున్నాయి. ఎయిర్‌పోర్ట్, నౌకాశ్రయం, స్టీల్‌ప్లాంట్ ఇలా అభివృద్ధికి కీలక మార్గాలన్నీ ఇక్కడే ఉండటంతో జనాభా పెరగడం, ట్రాఫిక్ సమస్య కూడా రోజురోజుకూ పెరుగుతూ వస్తోంది. దాతో ట్రాఫిక్ రద్దీకి జీవీఎంసీ చర్యలు చేపట్టింది.విశాఖ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసుల సహకారంతో జాతీయ రహదారిలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాలు, వాహనాల సంఖ్య, తీసుకోవాల్సిన చర్యలపై జీవీఎంసీ ఇటీవల సర్వే చేపట్టింది. గాజువాక నుంచి కొమ్మాది వరకు అత్యంత క్లిష్టమైన కూడళ్లను పరిశీలించిన అధికారులు 35 కూడళ్ల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై ఒక నిర్ణయానికి వచ్చారు.ఈ 35 కూడళ్లలో ప్రైవేట్ ఏజెన్సీతో ప్రణాళికలు రూపొందించి అమలు చేయడానికి జీవీఎంసీ సిద్ధమైంది. ఒక్కో కూడలిలో రూ. 1.5 కోట్ల నుంచి రూ. 2 కోట్ల వరకు వెచ్చించనున్నారు. ఇక్కడ ప్రధానంగా సర్వీసు రహదారి ఏర్పాటు చేయడం.. ప్రస్తుతం ఉన్న ఫ్రీ లెఫ్టులను మరింత అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.వెంకోజీపాలెం వద్ద హెచ్‌బీ కాలనీకి వెళ్లే రహదారి విస్తరించడం, విశాఖ వ్యాలీ కూడలి వద్ద మరో సర్వీసు రహదారి నిర్మించడం, ఎండాడ వద్ద సర్వీసు రహదారి అభివృద్ధి చేయడం వంటి ప్రతిపాదనలు అధికారులు తీసుకున్నారు. ఈ పనులను చేయడానికి త్వరలోనే టెండర్లను ఆహ్వానించనున్నారు. జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఈ ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై సమావేశం కూడా నిర్వహించారు.జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసుల బృందం సర్వే ఆధారంగా ఒక అవగాహనకు వచ్చి అభివృద్ధి పనులు చేయట్టాలని నిర్ణయించారు. ఈ పనులను రెండు దశల్లో చేపట్టనున్నారు. మొదటి దశలో 11 కూడళ్లు ఎంపిక చేస్తారు.. ఆ తర్వాత మరో 24 కూడళ్లకు పనులను విస్తరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పనులన్నీ రెండు నెలల వ్యవధిలోనే పూర్తి చేయాలని భావిస్తున్నారు.

# తెరపైకి మంత్రివర్గ ప్రక్షాళన

విజయవాడ, రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి మంత్రివర్గ ప్రక్షాళన అంశం ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యాక ప్రభుత్వం కేబినెట్‌లో మార్పులు చేపట్టే అవకాశం ఉందనే ప్రచారం అధికార వర్గాలు, రాజకీయ విశ్లేషకుల మధ్య జోరుగా సాగుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల మంత్రులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పనితీరుపై స్పష్టమైన సందేశం ఇచ్చినట్లు రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ వ్యాఖ్యలను భవిష్యత్‌లో జరిగే మంత్రివర్గ మార్పులకు సంకేతాలుగా పలువురు విశ్లేషిస్తున్నారు.ప్రస్తుతం ప్రభుత్వం స్థానిక ఎన్నికలను అత్యంత కీలకంగా భావిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి మంత్రి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత సమర్థంగా తీసుకెళ్లాలని సీఎం సూచించినట్లు సమాచారం. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించడంతో పాటు ప్రతిపక్ష విమర్శలకు వెంటనే సమాధానం ఇవ్వాలని ఆయన సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం చేసిన పనులు ప్రజలకు చేరకపోతే ఆశించిన రాజకీయ ఫలితాలు రావని ఆయన స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.ముఖ్యంగా కొన్ని శాఖల్లో నిర్ణయాల అమలు ఆశించిన స్థాయిలో లేకపోవడం, ఫైళ్ల పరిష్కారంలో జాప్యం కనిపించడం, ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం తగ్గడం వంటి అంశాలపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. శాఖలపై పూర్తి పట్టు సాధించి ఫలితాలు చూపించాల్సిన అవసరం ఉందని ఆయన మంత్రులకు సూచించినట్లు సమాచారం. ప్రతి అంశంలో ముఖ్యమంత్రి జోక్యం అవసరం లేకుండా ఆయా శాఖల మంత్రులే ముందుండి పనిచేయాలని స్పష్టమైన సందేశం ఇచ్చినట్లు తెలుస్తోంది.జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రుల బాధ్యతల విషయంలో కూడా సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు సమాచారం. జిల్లాల్లో పార్టీ నాయకుల మధ్య సమన్వయం పెంచడం, అంతర్గత విభేదాలను తగ్గించడం, స్థానిక స్థాయిలో

# మళ్లీ పాత నియోజకవర్గాల కోసం డిమాండ్

విజయవాడ, వైసీపీ నేతలు తమ పాత నియోజకవర్గాలను కేటాయించాలని పార్టీ హైకమాండ్ పై వత్తిడి తెస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఖచ్చితంగా కూటమి పార్టీలకు గట్టి పోటీని ఇవ్వాలంటే తమకు పాత నియోజకవర్గాలకు పంపాలని కోరుతున్నారు. ఈ వాయిస్ ఇటీవల కాలంలో పార్టీ అధినేత జగన్ వద్ద ఎక్కువగా వినిపిస్తుంది. జగన్ జిల్లాల పర్యటనలకు వచ్చినప్పుడు కానీ, తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశమయినప్పుడు కానీ ఇదే విషయాన్ని పదే పదే ప్రస్తావిస్తున్నారట. తమకు ఇష్టం లేని, పరిచయాలు లేని నియోజకవర్గాల్లోనే కొనసాగిస్తే లోకల్ బాడీ ఎన్నికల్లో పార్టీకి ఇబ్బందికరమైన పరిస్థితులుంటాయని హెచ్చరిస్తున్నారట. తర్వాత తమను నిందించి, ఓటమిని తమ ఖాతాల్లో వేయవద్దని కోరుతున్నట్లు తెలిసింది. 2024 ఎన్నికలకు వైసీపీ అనేక ప్రయోగాలు చేసింది. అందులో ఒకటి మంత్రులతో పాటు ఎమ్మెల్యేలను వారి సొంత నియోజకవర్గాల నుంచి తప్పించి కొత్త నియోజకవర్గాలకు అభ్యర్థులు గా పంపింది. కొత్త అభ్యర్థులయితే.. స్థానికంగా ఉండే అసంతృప్తి నుంచి బయటపడి గెలవచ్చని నాడు జగన్ తీసుకున్న నిర్ణయం ఫలించలేదు. ఒకరకంగా చెప్పాలంటే ఆ బదిలీ వ్యూహం వికటించిందనే చెప్పాలి. మంత్రులుగా ఉన్న విడదల రజని, తానేటి వనిత, మేకపాటి సుచరిత, ఆదిమూలం సురేష్, అనిల్ కుమార్ యాదవ్, వెల్లంపల్లి శ్రీనివాస్ తో పాటు అనేక మంది ఎమ్మెల్యేలను మార్చి జగన్ నాడు పెద్ద ప్రయోగమే చేశారు. కానీ ఇష్టం లేకుండానే అక్కడకు వెళ్లిన నేతలు దాదాపుగా అందరూ ఓటమి పాలయ్యారు. వైసీపీకి కేవలం పదకొండు స్థానాలకే పరిమితమై ప్రతిపక్ష కూడా హోదా దక్కకపోవడానికి ఈ మార్పిడి నిర్ణయమూ ఒక కారణమంటున్నారు... దీంతో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ లోజరగనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలలో గెలవాలంటే తమ పాత నియోజకవర్గాలకు పంపాలని వైసీపీ నేతలు నాయకత్వానికి మొర పెట్టుకుంటున్నారు. కానీ జగన్ మాత్రం ఇప్పటి వరకూ దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. స్థానిక సంస్థల ఎన్నికల సమయం ముంచుకొస్తుండటంతో జగన్ విజయవాడ వచ్చినప్పుడల్లా కలసి తమ బాధను చెప్పుకుంటున్నారు. అయితే నవ్వడం మినహా జగన్ నుంచి నిర్ణయం వెలువడక పోవడంతో కొంత ఇబ్బంది కరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొత్త నియోజకవర్గాల్లో ఓటమి తర్వాత ఆ నేతలు క్యాడర్ కు దూరంగా ఉంటూ వస్తున్నారు. అలాగే తమకు బలం ఎక్కడ ఉంది? ఎక్కడ ప్రతిపక్షం బలంగా ఉందన్న విషయం తెలియదని, అందుకే తమకు ఓల్డ్ ఈజ్ గోల్డ్ అని చెబుతున్న నేతల మొర జగన్ పట్టించుకుంటారా? లేదా? అన్నది చూడాలి.

గెలుపే ధ్యేయంగా వైసీపీ వ్యూహం

వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా వైసీపీ వ్యూహం మార్చిందా అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో వైసీపీ నేతల వ్యాఖ్యలతో



పాటే, నిరసనలు, ఆందోళనల్లో వినిపిస్తున్న ఆ పేరే.. దీనికి బలం చేకూరుస్తోంది. తాజాగా డీఎస్సీ అక్రమాలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేసిన ట్వీట్‌లోనూ ఇదే పదం కనిపించడంతో.. రాజకీయ నిపుణులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. 2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యూహం మార్చిందా.. ఢిల్లీ ప్రభావం ఏపీలోని గల్లీపైనా పడిందా.. అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంపై ఢిల్లీ వేదికగా సాగిన జెన్ జీ ఉద్యమం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. చివరకు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి.. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామాచేయించింది కూడా. ఈ ఉద్యమంతో రాజకీయాల్లో జెన్ జీ పాత్ర ఏమిటనే దానిపై పొలిటికల్ పార్టీలకు ఓ క్లారిటీ వచ్చింది. దీంతో అన్ని పార్టీలు కూడాజెన్ జీలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. వారి సమస్యలపై ప్రధానంగా దృష్టి పెడుతున్నాయి. ఈ క్రమంలోనే ఏపీలోని యువతరాన్ని తమవైపు ఆకర్షించేందుకు వైసీపీ ప్రయత్నిస్తోంది. యువత, విద్యార్థుల సమస్యలను లేవనెత్తుతోంది. నీట్ తరహాలోనే ఏపీలో డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ ఆరోపిస్తోంది. జెన్ జీ ఉద్యమం ముందు వరకూ డీఎస్సీలో అక్రమాలపై వైసీపీ సాగించిన పోరాటం.. ప్రధాన్ రాజీనామా అనంతరం దేశవ్యాప్తంగా మారిన పరిస్థితుల కారణంగా కొత్త రూపు తీసుకుంది. వైసీపీ చేసే నిరసన కార్యక్రమాలు, ఆందోళనలలోనూ జెన్ జీ పేరును వైసీపీ నేతలు ఎక్కువగా ప్రచారంలోకి తీసుకువస్తున్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఇటీవల పొగాకు రైతులను పరామర్శించేందుకు తూర్పుగోదావరి జిల్లా దేవరాపల్లిలో పర్యటించారు. జగన్ పర్యటనకు జెన్ జీల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని... యువతరం పెద్ద సంఖ్యలో జగన్ కార్యక్రమానికి హాజరయ్యారని వైసీపీ నేతలు సోషల్ మీడియాలో షేర్ చేశారు.

# 80 శాతం తగ్గిన గులాబీ విరాళాలు

హైదరాబాద్,తెలంగాణలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్‌కు బిగ్ షాక్ తగిలింది. ఏడీఆర్ రిపోర్ట్ ప్రకారం.. ఆ పార్టీ ఫండ్స్ ఏకంగా 82 శాతం పడిపోయాయి. గతంలో రూ. 85 కోట్లు పొందిన బీఆర్ఎస్‌కు రూ.15 కోట్లకు పడిపోయింది. మరోవైపు.. ఎంఐఎం పార్టీ కూడా విరాళాలను సున్నాగా ప్రకటించింది. అంతేకాకుండా.. ఈ 2 పార్టీలు తమ విరాళాల నివేదికలను ఎన్నికల కమిషన్‌కు గడువు దాటిన తర్వాతే సమర్పించాయని నివేదిక స్పష్టం చేసింది.తెలంగాణ ఏర్పడిన తర్వాత దాదాపు 10 ఏళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)కి అధికారాన్ని కోల్పోయిన తర్వాత తీవ్ర ఆర్థిక ఎదురుదెబ్బ తగిలింది. విరాళాల సమీకరణలో బీఆర్ఎస్ గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయింది. పొలిటికల్ ఫండింగ్ డిస్‌క్లోజర్స్‌పై 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్' (ఏడీఆర్) విడుదల చేసిన నివేదిక ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.20 వేల కంటే ఎక్కువ ఉన్న బీఆర్ఎస్ విరాళాలు గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 82 శాతం క్షీణించాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 8 మంది దాతల ద్వారా రూ. 85 కోట్ల విరాళాలు పొందిన బీఆర్ఎస్ పార్టీ.. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేవలం 4 దాతల ద్వారా రూ. 15 కోట్లు మాత్రమే రాబట్టగలిగింది. దేశవ్యాప్తంగా విశ్లేషించిన ప్రాంతీయ పార్టీలన్నింటిలోనూ అత్యధికంగా నికర రూపంలో రూ. 70 కోట్ల మేర విరాళాలు కోల్పోయిన పార్టీగా బీఆర్ఎస్ నిలిచింది. గతంలో రద్దైన ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రూ. 495 కోట్లు రాబట్టి తెలుగు రాష్ట్రాల పార్టీల్లోనే అత్యధిక నిధులు పొందిన పార్టీగా రికార్డు సృష్టించిన బీఆర్ఎస్‌కు.. అధికారం పోయిన తర్వాత విరాళాల ప్రవాహం మందగించడం గమనార్హం.తెలంగాణకు చెందిన మరొక ప్రముఖ ప్రాంతీయ పార్టీ ఆల్ ఇండియా మజ్లిస్ ఎ ఇత్తేహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఎంఐఎం పార్టీ 2024-25 సంవత్సరానికి గాను రూ.20 వేల కంటే ఎక్కువ ఉన్న విరాళాలను సున్నాగా ప్రకటించింది. కాగా.. 2023-24లో ఈ పార్టీ 16 విరాళాల ద్వారా రూ. 9 లక్షలు వచ్చినట్లు వెల్లడించింది. నేషనల్ లెవల్‌లో గత ఏడాది నిధులు ప్రకటించి.. ఈ ఏడాది రూ.20 వేలకు పైబడిన విరాళాలు సున్నాగా చూపిన 3 పార్టీల్లో ఎంఐఎం ఒకటిగా నిలిచింది.ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువును పాటించడంలోనూ తెలంగాణ పార్టీలు విఫలం అయ్యాయి. 2023-24లో సరైన సమయానికే విరాళాల వివరాలను ఈసీకి సమర్పించిన బీఆర్ఎస్, ఎంఐఎం.. 2024-25కి సంబంధించి మాత్రం గడువు దాటిన తర్వాతే నివేదికలు ఇచ్చాయి. బీఆర్ఎస్ నిర్ణీత గడువు కంటే 9 రోజులు ఆలస్యంగా రిపోర్ట్ చేయగా.. ఎంఐఎం 28 రోజుల ఆలస్యంగా తన నివేదికను సమర్పించినట్లు ఏడీఆర్ నివేదిక స్పష్టం చేసింది.

# కేబినెట్ ప్రక్షాళన కు లైన్ క్లియర్

హైదరాబాద్, తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తయింది. అయినా ఇప్పటికీ పూర్తిస్థాయిలో కేబినెట్ కొలువుదీరలేదు. రెండు స్థానాలు ఇంకా ఖాళీగానే ఉన్నాయి. వీటిని ఎప్పుడు భర్తీ చేస్తారా.. అనే ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది. ఈ నేపథ్యంలో కేబినెట్ విస్తరణపై అడుగులు ముందుకు పడుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. కొంతకాలంగా క్యాబినెట్‌ను పూర్తిస్థాయిలో పునర్వ్యవస్థీకరిస్తారనే ప్రచారం జరిగింది. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ అధిష్టానం ఒక సురక్షితమైన మధ్యేమార్గాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. అసంతృప్తులకు తావివ్వకుండా, కేవలం ఖాళీగా ఉన్న రెండు మంత్రి పదవులను మాత్రమే భర్తీ చేసి ప్రస్తుతానికి రాజకీయాన్ని చల్లబరిచేందుకు ఏఐసీసీ సిద్ధమైంది. వారం, పది రోజుల్లో, అంటే ఈ నెల 14వ తేదీ తర్వాత చిన్నపాటి విస్తరణపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. జులైలో ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ నేరుగా రంగంలోకి దిగి రాష్ట్రంలోని పలువురు మంత్రులతో వరుసగా వ్యక్తిగత సమావేశాలు నిర్వహించారు. శాఖల పనితీరు, ప్రభుత్వంపై వస్తున్న విమర్శలు, నాయకుల మధ్య సమన్వయం, వివిధ పోర్ట్‌ఫోలియోలకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై ఆమె ఒక సమగ్ర నివేదికను రూపొందించారు. ఈ సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన అధిష్టానం, ప్రస్తుత దశలో సమూల మార్పులు చేపడితే ఎదురయ్యే ముప్పును ముందే ఊహించింది. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో మంత్రుల రాజీనామాలు, తొలగింపుల వల్ల ఉత్పన్నమైన రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణలో అలాంటి అలజడులకు ఆస్కారం ఇవ్వకూడదని నిర్ణయానికొచ్చింది. హైకమాండ్ సూచన మేరకు సీఎం రేవంత్ రెడ్డి రెండు కీలక సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించనున్నారు. ఒకటి గిరిజన సామాజిక వర్గానికి, మరొక దాన్ని ఉమ్మడి జిల్లాల ప్రాతినిధ్యం లేని రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. ఎస్టీ (లంబాడా) రేసులో గిరిజన సామాజిక వర్గానికి చెందిన రామచంద్ర నాయక్, బాలు నాయక్ లేదా దేవరకొండ ఎమ్మెల్యే పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఇక రెడ్డి సామాజిక వర్గం నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్



రెడ్డి, సుదర్శన్ రెడ్డి వంటి సీనియర్లు తమ శాయశక్తులా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వీరితో పాటు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేరు ప్రముఖంగా చర్చల్లో ఉంది. అసెంబ్లీ ఎన్నికల ముందే తనకు క్యాబినెట్‌లో చోటు కల్పిస్తామని అధిష్టానం హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన వర్గీయులు గుర్తు చేస్తున్నారు.ప్రస్తుత విస్తరణలో భారీగా పోర్ట్‌ఫోలియోలు మారుతాయా లేదా అనే అంశం పక్కన పెడితే, కొన్ని కీలక శాఖల్లో చిన్నపాటి మార్పులు ఉండే అవకాశం ఉందనే సంకేతాలు వెలువడుతున్నాయి. అయితే, మంత్రిపదవులు ఆశిస్తున్న నాయకుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో, పదవులు దక్కని వారి నుంచి ఎలాంటి ప్రతిఘటన లేదా బహిరంగ అసంతృప్తి రాకుండా చూడటమే రేవంత్ రెడ్డికి, హైకమాండ్‌కు ఉన్న అతిపెద్ద సవాలు. ఇందుకోసం తుది ప్రకటనకు ముందే ఆశావాహులతో వ్యక్తిగతంగా చర్చలు జరిపి, వారికి ఇతర నామినేటెడ్ లేదా పార్టీ పదవుల హామీలతో బుజ్జగించే వ్యూహాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ నాయకత్వం యోచిస్తోంది.మొత్తానికి, పెద్ద ఎత్తున రీషఫుల్ చేసి లేనిపోని చిక్కులు కొనితెచ్చుకోవడం కంటే, రెండు ఖాళీలను భర్తీ చేస్తూ సామాజిక సమతుల్యతను కాపాడుకోవడమే ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ కాంగ్రెస్‌కు రాజకీయంగా లబ్ధి చేకూరుస్తుందని భావిస్తున్నారు. ఈ నెల 14 తర్వాత వచ్చే ఆ కీలక ప్రకటనతో కాంగ్రెస్ అంతర్గత రాజకీయ సమీకరణాలు ఏ మలుపు తిరుగుతాయో వేచి చూడాలి.

# బీజేపీ పగ్గాలు బండి సంజయ్ కేనా ?



హైదరాబాద్,కేంద్ర మంత్రిగా ప్రస్తుతం ఉన్న బండి సంజయ్ కి తెలంగాణా బీజేపీ పగ్గాలు దక్కే అవకాశాలు దండీగా కనిపిస్తున్నాయి. ఆయనకు అటు ఆర్ఎస్ఎస్ అలాగే కేంద్ర పెద్దల ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయని అంటున్నారు. బండి సంజయ్ బీజేపీ అధ్యక్షుడిగా నూరు శాతం మార్కులు సాధించిన ట్రాక్ రికార్డు కూడా కళ్ల ముందు ఉంది. ఆయన హయాంలో బీజేపీ ఉప ఎన్నికల్లో విజయాలు సాధించింది. అంతే కాదు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అయితే దాదాపుగా యాభై దాకా కార్పోరేటర్లను గెలుచుకుంది. బండి సంజయ్ బీజేపీ అధ్యక్షుడుగా ఉన్న నాడు పార్టీని పరుగులు పెట్టించారు. ఢీ అంటే ఢీ అనేలా కేసీఆర్ ప్రభుత్వం మీద దూకుడు చేసేవారు. అయితే సరిగ్గా 2023 ఎన్నికల ముందు ఆయన్ని తప్పించేశారు. దాంతో బీజేపీలో జోష్ పోయింది అన్న విమర్శలు అప్పట్లోనే వినిపించాయి.

అనుకూల వాతావరణంగానే :

ఇక బీజేపీకి చెందిన పెద్దలు కొందరు తెలంగాణాలో తిష్ట వేసి గ్రౌండ్ లెవెల్ లో పరిస్థితులను అధ్యయనం చేశారు అని అంటున్నారు. అంతే కాదు పార్టీకి అంతా అనుకూల వాతావరణం ఉందని నిర్ధారించారు. అయితే దానిని సొమ్ము చేసుకునే విధంగా పార్టీయే లేదని తేల్చారు. బీజేపీ నాయకుల మధ్య విభేదాలు వర్గ పోరు కారణం అని కూడా తమ నివేదికలలో పేర్కొన్నారు. దాంతో పార్టీ పెద్దలు అంతా కలసి నాయకుల మధ్య సఖ్యత పెరిగేలా చూస్తున్నారు. అందులో భాగమే ఈటెల రాజేందర్ అలాగే బండి సంజయ్ చేతులు కలపడం అని చెబుతున్నారు. అలాగే మరింత మంది నాయకుల మధ్య కూడా ఐక్యతను సాధించారు అని అంటున్నారు.

ఈసారి కొట్టాల్సిందే :

ఆరు నూరు అయినా ఈసారి తెలంగాణా రాష్ట్రంలో కమలం జెండా పాతాల్సిందే అని బీజేపీ పెద్దలు గట్టిగానే నిర్ణయించుకున్నారు. దాంతోనే పార్టీ ప్రక్షాళన మొదలెట్టారు. బీజేపీకి కొత్త జాతీయ అధ్యక్షుడిగా నియమితులు అయిన నితిన్ నబీన్ అయితే ఫుల్ ఫోకస్ తెలంగాణా మీద పెట్టారు. ఆయన ఇప్పటికే రెండు మూడు సార్లు పర్యటించి వెళ్ళారు. ఇక మీదట ప్రతీ రెండు నెలలకు ఒకసారి తప్పకుండా తెలంగాణాలోకే వచ్చి మొత్తం పార్టీ పరిస్థితులు సమీక్ష చేస్తాను అని జాతీయ నాయకత్వమే సూచించడంతో నేతలు అంతా అలెర్ట్ గా ఉంటున్నారని తెలుస్తోంది.

సమర్థులకు పెద్ద పీట :

పార్టీలో అందరికీ న్యాయం చేస్తామని అధినాయకత్వం చెబుతోంది. ఎవరూ నిరాశ చెందాల్సింది లేదని అంటోంది. ఈ విధంగా ఈటెలకు కూడా రానున్న రోజులలో మంచి అవకాశాలు ఉంటాయని అంటోంది. బండి సంజయ్ కి పార్టీ పగ్గాలు అప్పగిస్తే ఈటెలకు కేంద్ర మంత్రిగా చాన్స్ ఉండొచ్చు అని అంటున్నారు. అలాగే మహిళా కోటాలో డీకే అరుణకు కూడా కేంద్ర మంత్రిగా అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. మరో వైపు చూస్తే పార్టీ నుంచి వీడిపోయిన గోషా మహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ లాంటి ఫైర్ బ్రాండ్లను తిరిగి పార్టీలోకి తీసుకుంటారు అని కూడా అంటున్నారు. మొత్తానికి రానున్న రోజులలో పార్టీకి రిపేర్లు మొత్తం చేసి దసరా నాటికి తెలంగాణా బీజేపీ బండిని కేంద్ర మంత్రి బండి సంజయ్ కి అప్పగిస్తారు అని అంటున్నారు. అదే జరిగితే బీజేపీ దూకుడు కూడా వేరే లెవెల్ లో ఉంటుందని అంటున్నారు.

# వివాదాల్లో మంచిర్యాల ఎమ్మెల్యే

అదిలాబాద్, కొన్ని పత్రికల్లో ప్రచురితమైన అవినీతి , అక్రమాల కథనాలను మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తీవ్రంగా ఖండించారు. తన వ్యక్తిత్వ హననానికి, రాజకీయ ఎదుగుదలను అడ్డుకోవడానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కొందరు రాజకీయ ప్రత్యర్థులు కుట్రపూరితంగా ఈ తప్పుడు ప్రచారాన్ని నడిపిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో గానీ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గానీ తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని.. ఇసుక, భూముల వ్యాపారాలకు ఎప్పుడూ దూరంగానే ఉన్నానని స్పష్టం చేశారు. ఆధారాలు లేకుండా తనపై అసత్య కథనాలు రాస్తున్న వ్యక్తులు, సంబంధిత పత్రికలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.ప్రధానంగా ప్రచారంలో ఉన్న రూ. 450 కోట్ల బ్యాంక్ రుణాల వ్యవహారంపై ఎమ్మెల్యే పక్కా ఆధారాలతో క్లారిటీ ఇచ్చారు. 2009-10 కాలంలో సాయినాథ్ ప్రైవేట్ లిమిటెడ్, భాగ్యనగర్ హోటల్స్ పేర్లపై బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయని, అవి తాను సొంతంగా సృష్టించిన పత్రాలు కావని తెలిపారు. 2014 నుంచి 2025 వరకు కంపెనీ ద్వారా వినియోగించిన మొత్తం నిధులు రూ. 109 కోట్ల 11 లక్షలు మాత్రమేనని, అన్ని బ్యాంకులు కూడా అదే మొత్తాన్ని ఎన్‌పీఏ గా గుర్తించాయని వివరించారు. ఒకవేళ రూ. 450 కోట్ల మేర మోసమే జరిగి ఉంటే బ్యాంకులు కేవలం రూ. 109 కోట్లకు ఆస్తులను ఎలా వేలం వేస్తాయని ఆయన ప్రశ్నించారు.రుణ చెల్లింపులకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తూ, 2014 నుంచి 2025 మధ్య కాలంలో బ్యాంకులకు ఇప్పటికే రూ. 44 కోట్ల 81 లక్షలు చెల్లించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆంధ్ర బ్యాంక్ ఖాతా ఎన్‌పీఏగా మారిన తర్వాత కూడా మరో రూ. 18 కోట్ల 72 లక్షలు చెల్లించామని, 2024 అక్టోబర్ 31 నుంచి నిరంతరంగా చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. వ్యాపారంలో ఎదురైన ఒడుదొడుకులను ప్రస్తావిస్తూ.. యూఎస్ ట్రేడింగ్ మార్కెట్ తీవ్ర పతనం కావడం వల్ల తాను వ్యక్తిగతంగా రూ. 160 కోట్ల మేర భారీ నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందని, అయినప్పటికీ బాధ్యతాయుతం గా బ్యాంకు బకాయిలను తీరుస్తున్నట్లు చెప్పారు.తన సామాజిక, ప్రజా సేవలను గుర్తుచేస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా సొంత నిధులతో 15 పాఠశాలలను నిర్మించి విద్యారంగానికి సహాయపడ్డానని ప్రేమ్ సాగర్ రావు తెలిపారు. తనపై ఆరోపణలు చేస్తున్న నాయకులు ధైర్యముంటే ఎక్కడైనా బహిరంగ చర్చకు రావాలని, తాను పూర్తి ఆధారాలతో సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. అవసరమైతే ఈ వ్యవహారంపై నిజానిర్ధారణ కమిటీ వేసినా, కమిటీ ముందుకు




వచ్చి అన్ని పత్రాలు, సాక్ష్యాధారాలు సమర్పించేందుకు తాను వెనుకాడేది లేదని ప్రకటించారు. రాష్ట్ర కేబినెట్ విస్తరణలో తన పేరు మంత్రి పదవి రేసులోకి వచ్చిన ప్రతిసారీ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొందరు స్వపక్ష, విపక్ష నేతలు కావాలనే ఇటువంటి కుట్రలకు తెరలేపుతున్నారని ఎమ్మెల్యే తీవ్ర ఆరోపణలు చేశారు. గత పదేళ్లపాటు తీవ్ర ప్రతికూల పరిస్థితులలో, ప్రతిపక్షంలో ఉంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పోరాడిన తనపై ఇలాంటి నిరాధార ఆరోపణలు చేయడం తీవ్ర బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే ఈ రాజకీయ కుట్రల వెనుక ఉన్న అసలు సూత్రధారుల జాతకాలు బయటపడతాయని, నిజా నిజాలు త్వరలోనే ప్రజల ముందుకు వస్తాయని ప్రకటించారు.

## శతచండీ యాగంతో ఇందూరు పావనం

ఇందూరు: శత చండీయాగంతో ఇందూరు పావనమైందని, లోక కళ్యాణార్థం యాగం చేయడం అద్భుతమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. మర్చంట్ అసోసియేషన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, ఉమామహేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని మార్కెట్ యార్డులో నిర్వహించిన శత చండీయాగం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ యాగంతో ఎల్ నినో పరిస్థితులను అధిగమించి మంచి వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ మూడు రోజుల యాగం ఫలితం మొదటి రోజే చూశామని సమృద్ధిగా వర్షం కురిసిందని గుర్తు చేశారు. రైతు బాగుంటే అందరూ బాగుంటారని, దేశం బాగుంటందన్నారు. హిందూ ధర్మంలో మాత్రమే “సర్వే జన సుఖినో భవంతు” అని అంటారని, అందరికోసం వేడుకోవడం జరుగుతుందన్నారు. ప్రధానంగా యాగం నిర్వహణకు కృషి చేసిన అన్ని సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు.

# తమిళ బడ్జెట్ లో విజయ్ హామీలకు నిధులు



చెన్నై, ఈ ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండదు. అతుకుల బొంత. ఎప్పుడైనా కూలిపోవచ్చు. మధ్యంతర ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి. కార్యకర్తలు ధైర్యంగా ఉండండి. నమ్మకాన్ని కోల్పోవద్దు..ఇవి ఇటీవల డీఎంకే అధినేత స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు. అంతేకాదు విజయ్ గవర్నమెంట్ మీద.. గవర్నెన్స్ మీద ఆయన విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి కనీసం మూడు నెలలు కూడా పూర్తికాకముందే.. కొత్త ప్రభుత్వానికి ఆరు నెలలపాటు హనీమూన్ పీరియడ్ అనేది ఉంటుందని తెలిసి కూడా.. స్టాలిన్ విమర్శలు చేయడం మొదలుపెట్టారు. విజయ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించడం ప్రారంభించారు.ఎన్నికల సమయంలో నూతన వధువులకు 8 గ్రాముల బంగారం? పట్టు చీరలు.. ప్రభుత్వ వైద్యశాలలో జన్మించిన పిల్లలకు బంగారు ఉంగరాలు.. కాలేజీ విద్యార్థులకు లాప్టాప్ లు.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్.. వంటి హామీలను విజయ్ ప్రకటించారు. ఈ హామీలు అమలు చేయాలని.. నూతన వధువులకు బంగారం.. పట్టు చీరలు ఇచ్చే అవకాశం లేదని.. ప్రభుత్వం వీటిని నిలబెట్టుకోలేదని.. అనేక సందర్భాలలో స్టాలిన్ విమర్శించడం ప్రారంభించారు. ఈ విమర్శలకు టీవీకే నేతలు పెద్దగా స్పందించలేదు. విజయ్ కూడా రియాక్ట్ కాలేదు.టైం చూసి దెబ్బ కొట్టడం విజయ్ కి అలవాటు. సినిమాల్లో అయితే విలన్ ను ఎలా కొడతాడో.. రియల్ లైఫ్ లో కూడా తన ప్రత్యర్థిని కూడా అలాగే విజయ్ దెబ్బ కొట్టాడు. తమిళనాడు బడ్జెట్లో విజయ్ తన తిరుగులేని వ్యూహాత్మకత విధానాన్ని ప్రదర్శించాడు.. ప్రతిపక్షాలు అంచనా వేయలేని విధంగా తమిళ ప్రజల మీద వరాల జల్లు కురిపించాడు. నూతన వధువులకు 8 గ్రాముల బంగారం.. పట్టుచీర అందించడానికి 912 కోట్లు కేటాయించింది విజయ్ ప్రభుత్వం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టే పిల్లలకు బంగారు ఉంగరం ఇచ్చేందుకు 560 కోట్ల కేటాయించింది. కాలేజీలలో చదువుకునే విద్యార్థులకు ల్యాప్టాప్లు అందించడానికి 2000 కోట్లు కేటాయించింది. తొలిసారి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు రాయితీ 25వేల నుంచి 35వేలకు పెంచింది. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పేదలకు అందిస్తామని ప్రకటించింది. దీనికి సంబంధించి కూడా నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించింది.ఈ హామీల మీద విజయ్ ప్రభుత్వాన్ని పదేపదే డిఎంకె ప్రశ్నిస్తోంది. వీటిని అమలు చేయాలని కోరుతూ ఉంది. దీనిపై విజయ్ ఇంతవరకు మాట్లాడలేదు. చివరికి బడ్జెట్లో తన కేటాయింపుల ద్వారా డీఎంకే చేస్తున్న ఆరోపణలకు సాలిడ్ సమాధానం ఇచ్చారు. అంతేకాదు తాను మాట ఇస్తే మడమతిప్పే అవకాశం లేదని స్పష్టం చేస్తున్నారు. బడ్జెట్ కేటాయింపుల నేపథ్యంలో టీవీకే నేతలు సోషల్ మీడియాలో ఎదురు దాడి మొదలు పెట్టారు. డీఎంకే నేతలను లక్ష్యంగా చేసుకొని.. ఇప్పుడేమంటారని ప్రశ్నిస్తున్నారు.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140